




ప్రభువగు యెహోవాయే నాకు బలము

# HANNA KRUPA

సంపుటి : 6 A Christian Devotional Monthly Magazine సంచిక : 8



Founder :
**Kodavatikanti Emmanuel Rajendra,** B.A.,B.L.,

Editor :
**Nathaniel R. Kodavatikanti,** B.Th.,M.A.,(M.Phil)

Hon'ble Editor :
**A.N.R. Zakkam**
D.G.M., SOMA Enterprises, Rajasthan

Hon'ble Advisor :
**Yadavalli Prasada Rao**
D.A.O.,G.H.M.C., Hyderabad

Patrons :
**Dr. Y.S. Purushottam Reddy**
Superintendent, Rajareddy Hospital
Pulivendula

**Rev. Dr. K. Joseph**
Director, I.E.R.F. Ongole

**Rev. Dr. M.S. Santhavardhan**
Director, Good News Messenger, Guntur


## విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము.. | చీఫ్ ఎడిటర్ | 3 |
| బ్రాహ్మణ పూజారి..... | టాలెంట్ ఫర్ క్రైస్ట్, సికింద్రాబాదు | 4 |
| క్రైస్తవుల హక్కులు... | యస్. ప్రభుదాసు, B.A.,B.L., మంగళగిరి | 6 |
| యజ్ఞము... | కీ॥శే॥ పండిట్ సి.హెచ్. ఫ్రాన్సిస్ | 7 |
| ధవళ సింహాసనము | శ్రీ జడ్. సి. దేవదానం, కర్నూలు | 8 |
| బ్రదర్ భక్తసింగ్ | డా॥ పి. చంద్రశేఖరరావు | 9 |
| మదర్ థెరిస్సా | యడవల్లి ప్రసాదరావు, హైదరాబాద్ | 10 |
| సాక్ష్యము | లక్ష్మీనలందా | 12 |
| విశ్వాసంలో ఓ మెట్టు | కొడవటికంటి | 14 |
| జనవరి నెల ప్రశ్న | హన్నాకృప డెస్క్ | 16 |
| గొల్లపల్లి నతానియేలు | థామస్ అజరయ్య, హైదరాబాద్ | 17 |
| కనువిప్పు | బొకినాల ఇశ్రాయేలు, విజయవాడ | 19 |
| సాక్ష్యము | యస్.ఏ.టి.ఆర్.ప్రసాద్ | 21 |
| ప్రయాణంలో ఓ మజిలి.. | హన్నాకృప డెస్క్ | 22 |
| సువార్తలలోని యేసు కథ | కొడవటికంటి | 24 |
| అరచుపిల్లకాకులు | కల్వరి సుధాకర్, ఒంగోలు | 25 |
| ఆహ్వానము | హన్నాకృప డెస్క్ | 26 |
| News | Desk | 27 |



**చందా వివరములు:**

సంవత్సర చందా : రు. 150-00
జీవిత చందా : రు. 3000-00
పోషక చందా : రు. 5000-00

ఆన్‌లైన్ అకౌంట్ నెం. : 10957294362
బ్రాంచి నెం. : 0890
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కె. సామ్యేల్ రాజేంద్ర
6వలైను, క్లాపేట, ఒంగోలు



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప,
54-1-23 (A), కృపాదానంవీధి, క్లాపేట, 6వ లైను, ఒంగోలు- 1.

# నా కుటుంబము

మానవ సృష్టిలో దేవుడు కుటుంబానికి ప్రత్యేకస్థానం కల్పించాడు.అసలు ఆయన ఈలోకంలో నేరుగా మానవునిగానే అవతరించి, సిలువ మరణం పొంది మనకు పాపక్షమాపణ కల్పించవచ్చును లేక మరియమ్మకు యోసేపుతో కుటుంబం ఏర్పరచకుండానే కన్యకకు జన్మించ వచ్చును. తర్వాత మరియమ్మను యోసేపును కుటుంబ జీవితంలో వారిని ఒకటిగా చేయవచ్చును.

కన్యకగా ఉన్న మరియమ్మ గర్భములో పరిశుద్ధాత్మ ఆవరింపు ద్వారా గర్భములో ప్రవేశించిన తర్వాత వారిద్దరిని కుటుంబముగా ఏర్పరచి, ఆమె ప్రసవించే వరకు యోసేపు ఆమెను ఎరుగకుండునట్లు చేసి, యేసు జన్మించిన తర్వాత యోసేపు మరియమ్మను ఎరుగుటద్వారా వారికి యాకోబు, యోసే, యూదా, సీమోను అను నలుగురు మగపిల్లలు, కనీసం ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు.

అంటే రక్షకుడై, మానవుడైన దేవుడు ఖచ్చితంగా 30 సంవత్సరాల వరకు కుటుంబ జీవితం అక్కచెల్లెలతో అన్న దమ్ములతో, ఇరుగు పొరుగు వారితో, స్నేహితులతో, చర్చి (సమాజమందిరం)లో పాస్టర్లతో ఎలా జీవించాలో మానవులకు మార్గదర్శకంగా జీవించాడు. అంటే తల్లిదండ్రులను సన్మానించడంలో, చెల్లెళ్ళకు వివాహం చేయడం, తండ్రి చనిపోయిన తర్వాత కుటుంబ బాధ్యతలు విషయం నెరవేర్చెను.

ఇప్పుడు సంఘంలో, సమాజంలో ఎంత హోదా ఉన్నా, ఆత్మీయ జీవితంలో బోధకునిగానో సువార్తకునిగానో జీవిస్తున్నా కూడా కుటుంబానికే మొదటి స్థానం ఇవ్వాలి.

నీతిమంతుడైన లోతు కుటుంబాన్ని పరిపాలించడం అశ్రద్ధ వహించినందు వలన చివరికి ఏమయ్యాడో మనకు తెలుసు. పాతనిబంధన కొత్తనిబంధన అని వేరుగా లేకుండా బైబిలులో మొదటి అక్షరం నుండి చివరి అక్షరం వరకు యేసుప్రభువే కనిపిస్తాడు. పాతనిబంధన అంటే పాతబడినది అని కాదు. ఆదాము కథ నిన్నటిది కాదు నేటిదే. ఆదాముతో "నీవు నీ భార్య మాటవిని, తినవద్దని నీకాజ్ఞాపించిన మాట మీరావు కనుక" అని ప్రభువు అంటున్నాడు.

నాకు తెలిసిన వయస్సుమళ్ళిన స్త్రీతో –నీభర్తకి ఇలా చెయ్యకూడదని మీరు చెప్పకూడదా? అంటే ఆమె –అయ్యా భర్తకి భార్య విధేయురాలై యుండాలి కనుక ఆయనను సరియైన దారిలో నడిపించమని ప్రభువును ప్రార్థిస్తున్నాను. ప్రభువునందు విశ్వాసమున్నది అన్నది. దేవుడు భార్యని ప్రేమించమన్నాడు కాని ఆమె చెప్పిన మాట కంటే దేవుని మాటకు బైబిల్‌కి ఎక్కువ విలువ ఇవ్వాలి.

విశ్వాసియైన వాడు సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాదీనపరచుకొనుచు తన ఇంటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను. అంటే భార్యబిడ్డల యెడల కఠినంగా ఉండాలని కాని భార్యని కొట్టాలనికాదు. ఇంటి యజమాని సత్ప్రవర్తన చూసి ఇల్లంతా ప్రభువులోనికి నడిపించబడుతుంది.

ఈ లోకంలో మన పిల్లలు గొప్ప స్థితిలో ఆర్థికముగా గాని అంతస్తులోకాని గొప్పగా ఉండాలని ఎంతో కోరుకొని ఎన్నోచేస్తాము. కాని ఇక్కడ కుటుంబమంతా కలసి ఒకే పాత్రలోనిది త్రాగి, ఒకే పాత్రలో వండిన వంటకము భోంచేసి, ఒకే కప్పుక్రింది పండుకొని, ఈలోకం వదిలిన తర్వాత కొందరు సాతానుతో కలిసి నరకాగ్నిలో వేదన అనుభవించడం మనం చూడవలసి వస్తుంది. ఈ నిజాన్ని నమ్మితే చాలామంది చాలా విషయాల్లో, అంటే 'నీవు హేయమైనదానిని నీఇంటికి తేకూడదని' మోషే చెప్పాడు కనుక ఇంటిని కాపాడటానికి మనుష్యులను జీతానికి పెట్టుకొంటాము, కుక్కల్ని పెంచుకుంటాము. అయితే నీవు ఇంటి లోనికి శపితమైనవి అంటే మనం చేసే పనులు తల్లిదండ్రులు చనిపోయినా వారు తమ ఇంటిలోనికి తెచ్చిన శాపము వారి పిల్లలను వెంటాడుట మనం చూస్తూ ఉన్నాము. తల్లిదండ్రులు కుటుంబానికి తెచ్చిన దీవెనలు 'పిల్ల పిల్లతరము' వరకు నిలుచుండుట కూడా మనం చూస్తున్నాము.

ఆకాను తన ఇంటివారి కొరకు నేలలో దాచినది అతని కుటుంబమంతటి మరణానికి కారణమైనది. కోరహు, దాతాను, అబీరాములు మోషేపై చేసిన తిరుగుబాటుకు వారి కుటుంబాలన్ని భూమిలోకి పోయినవి. కుటుంబము కొరకు పొలము సంపాదించిన అహాబు కుటుంబసభ్యులు కుక్కలచేత తిని వేయబడ్డారు. దావీదు ఒక కుటుంబమును నాశనము చేసినందున అతని కుటుంబములోనే చిచ్చులేచినది.

**గమనిక : బైబిలు వాక్యములతో ముద్రింపబడిన మల్టీకలర్ హన్నాకృప 2008 క్యాలెండరును చందాదారులందరికీ ఉచితంగా పంపడం జరుగుతుంది. కావున చందా కట్టని వారు జనవరి నెలాఖరులోగా చందా పంపినచో వారికి కూడ పంపబడును. క్యాలెండరు వెల 25-00 రూపాయలు.**

సాక్ష్యము



# బ్రాహ్మణ పూజారి సత్యాన్వేషణ

**" విహ్వ్య గోప్తారాం మహక్యాదధిన కర్యుంతి హన్వా యాన సర్వతాసీన్ "**

**ఉద్యోగరీత్యా సువార్త యాత్ర :**

అందులో మిలటరీ వారు మరియు సివిల్ వారు కూడ కలిసియుండెడివారు. ఆ గుడిలో పాష్టరుగారు ఉండేవారు కాదు. ఎందుకనగా ఆ స్థలంలో సంవత్సరానికి 365 దినములు మంచు కురియును. దానిని 'హై యాల్టిట్యూడ్' ఏరియా అని ఆంగ్లభాషలో అంటారు. ఆ గుడిలో నేనొక ఆదివారం సాక్ష్యము చెప్పాను. ఇక అప్పటి నుండి ప్రతి ఆదివారము నేనే వాక్యపరిచర్య చేయాలని అన్ని తరగతులకు చెందిన విశ్వాసులంత నన్ను ప్రోత్సహించారు. వారి మధ్యలో వాక్య పరిచర్య చేసే ఆధిక్యత ప్రభువు తన ఉచితమైన కృపతో నాకనుగ్రహించెనని దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి అరుణాచల్ ప్రదేశ్‌లో దైవసేవ ప్రారంభించితిని. ఆ ప్రదేశాలలో కాటేజ్ మీటింగులు ఆనాటి వరకు జరిగియుండలేదు. ప్రతి బుధవారం కుటీర ప్రార్ధన. ఆదివారం గుడిలో ఆరాధన ప్రతిదినం సాయంకాలం సమయ మున విశ్వాసుల గృహములను దర్శించుచు ఆ కొండ ప్రాంతము లలో ఆ మంచులోయలలో రాత్రి 12. ఒంటిగంట వరకు కొన్నిమైళ్ళ దూరము కొండలెక్కుచు దిగుచు ప్రయాణం చేస్తుండే వాడను. ఈ విధమైన పరిచర్య సుమారు రెండు సంవత్సరముల వరకు చేసితిని.

**అరుణాచలప్రదేశ్‌లో ప్రభువు చేసిన గొప్ప కార్యములు :**

1962 వ సం॥లో భారత చైనాలకు మధ్య జరిగిన యుద్ధంలో తన తల్లిదండ్రులను పోగొట్టుకొనిన 18 ఏళ్ళ ప్రాయముగల బౌద్ధమతస్థుడు. జంగ్ బహదూర్‌ను నేను పరిశుద్ధాత్మ సహాయముతో కనుగొని, వానిని సంపాదించి వాక్యము చెప్పి ప్రభువు తట్టు త్రిప్పుటకు ప్రభువు నన్ను పనిముట్టుగావాడుకొనెను. వాడు తన మనస్సు మార్చుకొని ప్రభువు తట్టు తిరిగిన పిమ్మట మా యింట్లో వానిని కుమారునిగ చేర్చుకొన్నాను. ఒక సంవత్సరము మా యింటిలోనుంచుకొని ప్రార్ధనలు నేర్పి తేజ్‌పూర్ (అస్సామ్) మండి రెవ. ఆచార్యగారిని రప్పించి బాప్తిస్మము వానికిప్పించితిని. జనరల్ రిజర్వ్ ఇంజనీ రింగ్ ఫోర్స్‌లో ఆటోమొబైల్ మెకానిక్‌గా ప్రభువు కృప వలన అతనికి ఉద్యోగం లభించినది. ఆ యౌవనస్తుడు అంతకు పూర్వమే ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో శిక్షణ పొంది యుండెను. నా జీవితములో ప్రభువు నాద్వారా రక్షణలోకి నడిపించిన మొట్టమొదటి ఆత్మ ఇదే దేవుని నామమునకు స్తోత్రములు కలుగును గాక!

జోగాసింగ్ అనునొక సిక్కుమతస్థుడు (త్రాగుబోతు) ముగ్గురుపిల్లలు. తన భార్యతో కలిసి కాపురముండెడివాడు. వారిద్దరి మధ్య ఆ సమాధానముండుటచే వారు బహుదుః ఖముతో దినములు గడుపుచుండెడివారు ఆ అశాంతిని దూర పరచుకోవలెనని, సమస్త దుఃఖాన్ని మరచి పోవలెనని ప్రతిదినము మైకము కమ్మేటట్లు త్రాగుచుండెడివాడు. ఆయనట్లు త్రాగుట వలన వారు మరింత దుఃఖానికిగురియై దాంపత్య జీవితములో బాధలుపడుచుండెడివారు. మేము నివసించెడి మేడలోనే పైభాగమున వారుండెడివారు. మేము అనుదినము మోకాళ్ళూని వారికొరకు విజ్ఞాపనము చేయుచుంటిమి. భయంకరమైన చలికి అర్ధరాత్రివేళ దైవసేవ చేయుచువచ్చుటచే నాకు నిద్రపట్టేదికాదు. నేను నా భార్య కలసి ఆ అర్ధరాత్రి సమయములో క్రొవ్వొత్తి వెలుగులో ప్రభువు యొక్క సన్నిధి మా ముందు ఉండునట్లు అనుభవించుచు ప్రభువు సన్నిధిలో వారికొరకు విజ్ఞాపనలు చేయుచుండెడివారము.

ప్రభువు ఒకనాడు అర్ధరాత్రివేళ:

" జోగాసింగ్" అని జోగాసింగ్‌నకు నిద్రలోయుండగా ప్రభువు పిలిచెను.

"ఎవరయ్యా మీరు?"

"నేను నేనే నీ దేవుడను. నిన్ను పుట్టించిన నీ ఆశ్రయ దుర్గము నేనే. నీ రక్షణకేడెమును నేనే. నీవు నన్ను విసర్జించితివి."

"మీరు యేసు ప్రభువువలె కనిపించుచున్నాడు?"

"అవును. నేనే"

"ప్రభువా! గురుగోవింద్ దేవుడు కాడా?"

" ఆయనను సృష్టించినది నేనే"

"ప్రభువా! నన్ను క్షమించుము. నాకు తెలియక నేను పాపము చేసితిని"


"నీ పాపములు క్షమించబడియున్నవి నేనుతప్ప వేరొక దేవుడు నీకుండకూడదు. నన్ను వెంబడించుము నీకు విశ్రాంతి కలుగజేతును."

జోగాసింగ్ గారు వేకువనే మా ఇంటికివచ్చి "రావ్ సాహెబ్! నేను రాత్రి నా ప్రభువుతో మాట్లాడినాను " అని నాతో అన్నారు. "నేను ప్రభువును ఎట్లు పూజించాలో నాకు నేర్పించండి ఆయనే తప్ప వేరొక దేవుడులేడని ఆయన స్వయముగా నాతో అన్నారు. గురుగోవింద్ మనిషియని తెలుసుకున్నాను. ఇన్నాళ్లు ఆయనకు తెలియక పూజించాను. నాకు దర్శన మివ్వలేదు.

నాతో మాట్లాడలేదు. నేను యేసుప్రభువును పూజింపకుండగనే నాకు దర్శనమిచ్చి మనిషివలె మాట్లాడారు". అని జరిగిన సంగతిని పూసగుచ్చినట్లు ఒక్కాణించారు. వారికి ప్రార్థనేర్పి ప్రభువునందు బాగా బలపడేటట్లు సహవాసములోకి నడిపించాను. తరుచుగా ప్రభువు తనతో మాట్లాడడం జరిగింది. తన ద్వారా ప్రభువు నాకు కొన్ని విషయాలు తెలియజేసారు. తను తన సతీమణిగారు ఉభయులు ప్రభువుని సేవించుటకు సమ్మతించారు. ఉద్యోగమును వారు విడిచిపెట్టి తమ స్వగ్రామమునకు వెళ్ళిపోయారు అచ్చట ప్రభువుకొరకు పనిచేస్తామని నాతో వారు బలముగా చెప్పియుంటిరి. మేము చూస్తుండగనే ఆ దంపతుల మధ్య ప్రభువు గొప్ప సమాధానమేర్పరిచారు. వారు వెళ్ళిపోతూ నాతో ఒక్కమాట అన్నారు. " రావ్ సాహెబ్‌జీ! మీ దంపతులిద్దరును ఉపవాసముతో కన్నీరు కార్చి మా కొరకు ప్రభువు యొద్ద విజ్ఞాపనము చేశారు. ప్రతిఫలం మాలో గొప్ప శాంతి ఏర్పడినది కాని మేము మీకు బదులేమీ ఇవ్వలేకపోతున్నాం." అప్పుడు నేను, "మీరు నాకు బదులివ్వాలని యుంటే మీరు బ్రతికియున్నంత కాలము ఒకపని చేయండి. నా పరిచర్య ద్వారా, మీలాంటి అనేక కుటుంబాలు, ప్రభువు నెరిగి మార్గము తప్పిపోతున్న అనేక దైవసంతానములు, ప్రభువుతట్టు తిరిగి వారి పాపములు ఒప్పుకొని వాటిని విడిచిపెట్టి గొప్ప సమాధాన పరులుగ మార్చబడేటట్లు ఉపవాస ముండి కన్నీటితో ప్రార్థన చేయండి. అదిచాలు. అప్పుడు మీరు దైవాశీస్సులు పొంద గలరు." నేను వారికి వీడ్కోలు ఇచ్చాను. వారిప్పుడు ప్రభువు సేవలో పంజాబ్ రాష్ట్రమందు గురుదాస్‌పూర్‌లో యున్నారు. ప్రభువు వారిని, వారి పరిచర్యను దీవించి ఫలింపజేయునుగాక!

నా సతీమణి, రెబెక్కాగారు గర్భవతిగాయున్న దినములవి. "ప్రభో॰ కుమారుని ప్రసాదించినటులైనచో ప్రథమ ఫలం నీది గనుక నీ సేవకు సమర్పించుకుంటాము." అని మా ఇరువురము ప్రార్థన చేయుచున్నాము.అది చలికాలము. ఆ ప్రాంతంలో ఆకాల మందు వర్ణింప సఖ్యముకానంత దట్టముగ మంచు కురియు చుండెను. అటువంటి వాతావరణములో ఉదయమునలేచి మా కాలకృత్యములు ముగించుకొని కొద్దిగ ఎండ వచ్చినందుకు తడిబట్టలు ఎండలో ఆరవేయుటకు రెబెక్కాగారు, తలుపు తెరిచి బయటకు వెళ్ళారు. బట్టలు ఆరవేయుచున్న సమయ మందు, ఆమె పాదముక్రింద ఏదో తగిలినది. అది మెత్తగా మంచులో కప్పబడియుండెను. ఈమె పాదము దానిపై పడినవెంటనే అది చలించినది. పాదముక్రింద చలించునది ఏమైయుండునా? అని చూచి భయపడి పెద్ద కేకవేసి అవతలవైపునకు గెంతినది. ఆ కేకవిని నేను బయటకు వెళ్ళి చూడగా రాత్రి ఒక త్రాచుపాము కప్పలను బాగా తిని చలించలేని పరిస్థితిలో నేల పడియుండగా హటాత్తుగా మంచుకురిసినట్లున్నది. ఆ మంచుకు దాని శరీరము తిమి లెక్కి కొన ప్రాణముతో పడియుండెను. అది మంచు క్రిందపడి యుండుటచే ఈమె పాదము దానిపై పడినదని గ్రహించితిని. అక్కడ అనేక మంది మనుష్యులు కూడికొనిరి. అన్ని మతములవారు ఉంటిరి కొందరన్నారు: "మీరు నాగేంద్రునకు కాలితో కుమ్మినందుకు బంగారముతో గాని, లేక వెండితో గాని నాగుపామును చేసి 25 కొబ్బరికాయలు ఈశ్వరునకు అభిషేకము చేయవలసియున్నది. లేనియెడల మీ భార్య గర్భమందున్న శిశువు అంధుడై పుడతాడు. మరికొందరు: "మీరు ఈశ్వరునికి వెంటనే ముడుపు పసుపు గుడ్డతో కట్టి నాగేంద్రరాజా! నా భార్య గర్భమందున్న శిశువు నకు ఏ హానియు సంభవింపనిచో మీకు ఐదు వారములు వారమునకు ఐదు కొబ్బరికాయల చొప్పున అభిషేకము చేయించెదము. ఐదుగురు బ్రాహ్మణులకు అన్నదానం, వస్త్రదానం ఇచ్చెదమని ప్రమాణము చేసుకొనండి. అప్పుడు మీ భార్య గర్భమందున్న శిశువు చక్కగా పుట్టును." వారిలో అనేకులు క్రైస్తవులు మా వద్దకు వచ్చి మాతో: "అయ్యగారు! అవునండీ ఇది నిజమేనండి. అందరూ మీకు చెప్పమని మమ్ములను పంపారండి. మా శ్రీవారు గూడ నిన్నరాత్రి ఇదే మాట అన్నారండి మీరు మీ ఇంటికి వెంటనే ఉత్తరము వ్రాసి మీ తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేసి మీకు బదులుగ వారే ఈశ్వరుని కోవెలకు వెళ్ళి అలా మ్రొక్కుబడి చెల్లించుకోవడం మంచిదండీ.

(సశేషం)



# 'క్రైస్తవులు తెలుసుకోవలసిన హక్కులు'

**షెడ్యూల్డ్ తెగలకు ఈ ఆంక్షలు వర్తించవా? :**

మనదేశంలోని షెడ్యూల్డ్ తెగల వారు ఏ మతాన్ని స్వీకరించినా ఆఖరికి క్రైస్తవ మతాన్ని స్వీకరించినా వారికి కూడా షెడ్యూల్డ్ తెగల సర్టిఫికేట్ ఇస్తుంది ప్రభుత్వం. వారు ఏ మతస్థులైనా వారిపై ఆంక్షలు లేవు. కొండజాతుల వారు క్రైస్తవం స్వీకరించిన తప్పులేదు. కానీ దళితులు క్రైస్తవం స్వీకరిస్తే మాత్రం ఎందుకు వారిని షెడ్యూల్డ్ కులస్థులుగా గుర్తించరు. ఇందులో ఏదో మర్మం దాగి ఉంది. అది మతోన్మాదులకే తెలుసు. యస్.టి.లపై మత ఆంక్ష లేదు. యస్.సి. సర్టిఫికేట్ కోసం ఆంక్షలు.

**క్రైస్తవాన్ని ఎందుకు ఆదరిస్తున్నారు? ఆ మతాన్ని ఎందుకు అవలంభిస్తున్నారు?**

మనదేశంలో ఉన్నన్ని కులాలు ప్రపంచంలోని ఏదేశంలో లేవు. ఒకటికాదు, రెండుకాదు వందలాది కులాలు ఏర్ప డ్డాయి. వాటిలో ఒకటి ఎక్కువ కులం మరోకటి తక్కువ కులం. ఇంకొకటి అంటరాని కులం. ఇటువంటి అంటరాని కులాలు మన రాష్ట్రంలోని మాల, మాదిగ కులాలుకాక ఇంకా 57 ఉన్నాయి. భారతదేశ వ్యాప్తంగా వందలాది అంటరాని కులాలు ఆయా రాష్ట్రాల్లో ఉన్నాయి. మనుషులుగా పుట్టిన వారిని అంటరాని వారిగా గుర్తించి వారికి సామాజిక హక్కులు నిరాకరించి చచ్చిన జంతు కళేబరాను, మానవ శవాలను తగులబెట్టేవారిగా, పాకీపనులు, పాచిపనులు చేసేవారిగా ఇలాంటివే 59 రకాల పనికిమాలిన పనుల్ని వారి హక్కులుగా ఇచ్చి, వారిని అంటుకోవడమే పాపంగా గుర్తించి అంటరాని వారిగా చేయబడిన ఈ దేశ వాసుల్ని విదేశీయులైన క్రైస్తవులు చేతుల్తో ముట్టారు. హృదయాలకు హత్తుకున్నారు. చదువు సంస్కారం నేర్పారు. వైద్య సదుపాయం కల్పించారు. మానవ త్వాన్ని ప్రబోధించారు. పాటించారు. అందుకెంతో ముగ్దులైన అస్పృశ్య కులాల వారు క్రైస్తవాన్ని హృదయపూర్వకంగానే ఆదరించారు, అనుసరిస్తున్నారు.

**రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుకు ఇది వ్యతిరేకం :**

రాజ్యాంగంలో మతస్వేచ్ఛ, స్వాతంత్రం ప్రాథమిక హక్కుగా ఇవ్వబడింది. అయితే క్రైస్తవ మతం స్వీకరించిన దళితులను మాత్రమే బి.సి. (సి) లుగా గుర్తించిన ప్రభుత్వమే హిందూ, శిక్కు, బౌద్ధం స్వీకరించిన దళితులను మాత్రం షెడ్యూల్డ్ కులస్థులుగా గుర్తించడం అనేది ప్రాథమికహక్కును వ్యతిరేకించడమే. మత స్వాతంత్ర్యం ఉందన్నారు గదాఅని క్రైస్తవ మతం స్వీకరిస్తే వారికి మిగిలిన మతాల దళితులకు ఇచ్చే సౌకర్యాలు కల్పించకపోవడం నిజంగా రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కును కాలరాయడమే. నిజానికి ఏమతం తీసు కున్న దళితుల సామాజిక స్థితిగతుల్లో ఏమార్పు ఉండదు. అన్ని మతాల్లోని దళితులు ఊరిబయటే నివశిస్తుంటారు.

**ఏదో కుట్ర దాగి ఉంది :**

ఒకే సమాజిక స్థితిగతుల్లో నివశించే దళితులైన కొందరిని షెడ్యూల్డ్ కులస్థులనీ, మరికొందరిని వెనుకబడిన కులస్థులనీ వేరు పరచడంలో అర్థమేమైనా ఉందా. ఇందులో పెద్ద కుట్ర దాగి ఉంది. దళితుల్లో ఎక్కువ శాతం మంది ఆంతరంగికంగా క్రైస్తవాన్నే పాటిస్తారు. క్రైస్తవాన్ని పాటించే దళితులకు కూడా షెడ్యూల్డ్ కుల రాయితీలిస్తే ఏ దళితుడూ హిందూ దళితుడుగా కొనసాగకుండా సుమారు 90 శాతం పైగా దళితులు క్రైస్తవ దళితులుగా కొనసాగడానికి ఇష్టపడ తారు. హిందూదేశంగా చెప్పుకుంటున్న భారతదేశంలో క్రైస్తవ జనాభా పెరగడం ఇష్టంలేక క్రైస్త దళితులకు షెడ్యూల్డ్ కుల అర్హత ఇవ్వడం లేదు.

పైవన్నియూ పరిశీలనగా గమనిస్తే మతమార్పిడి కోసం క్రైస్తవులు ప్రలోభాలకు గురిచేయడం అనేది ఒట్టిమాట. నిజానికి ప్రభుత్వమే రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తూ క్రైస్తవమతం అభివృద్ధిని నిరోధిస్తూ హిందూ, శిక్కు, బౌద్ధం స్వీకరించిన దళాతులకే అనేక రిజర్వేషన్ రాయితీలు, ప్రలోభాలు పెట్టి ఆయా మతాలను అభివృద్ధి చేస్తుంది ప్రభుత్వమే అనేది గట్టిమాట. మత మార్పిడిపై గగ్గోలును ప్రక్కనపెట్టి సువార్త సునాదాన్ని సర్వజనులకు చాటిచెప్పడమే మన క్రైస్తవుల హక్కుగా మన బైబిల్ ద్వారా మనం నేర్చుకున్న దాన్ని పాటిద్దాం. ఎవరినీ నిందించడం వాదులాడడం మన పనికాదని వాక్య ప్రకారం క్రైస్తవులమంతా కలసి నడుద్దాం.

తనను శిలువపై చిత్రహింసలు పెట్టి, హేళన చేస్తున్న వారిని ఎంతో దయతో " తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు. వీరిని క్షమించు" అని పలికిన యేసు మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని మతోన్మాదులపైన దేవాలయాన్ని అపవిత్రం చేస్తున్న వారిపైన యేసయ్య కోపాన్ని ప్రదర్శించాడనేది గుర్తించాలని అదే సమయంలో యేసు తన శిష్యులకు బోధించిన విధంగా సువార్తను సర్వజనులకు చాటి చెప్పే బాధ్యతను మనం గుర్తించి యేసయ్య అనుభవించిన శిలువ శిక్షకు మనం సమాయత్తం కావాలని పిలుపునిస్తున్నాం.

# యజ్ఞము



పండిత సిహెచ్. ఫ్రాన్సిస్

**వాజపేయము :**

**శ్రు॥ యజమానః పశుః యజమానమేవ సువర్గలోకం గమయతీ॥**

అనగా యజ్ఞము చేయువాడే యజ్ఞపశువు. అతడే సర్వలోకమేలునని కలదు.

శతపధ బ్రాహ్మణమునందు "ప్రజాపతి ర్యజ్ఞం" అనగా ప్రజాపతియే యజ్ఞమనియు "తస్య ప్రజాపతేరర్ధమేవ మర్త్యమాసీరర్ధ మమృతం" ఆ ప్రజాపతి సగము మర్త్యు డుగను సగము అమర్త్యుడుగనుండి మర్త్య శరీరమును బలిగ నిడి, అమర్త్య శరీరముచే మృత్యువు నోడించుననియు కలదు. సామవేద తాండియ మహా బ్రాహ్మణములో-

**శ్రు॥ ప్రజాపతిర్దేవేభ్య ఆత్మనాం యజ్ఞం కృత్వా ప్రాయశ్చిత్॥**

అనగా ప్రజాపతి ఆత్మల రక్షణార్ధము (తనను తానే) యజ్ఞముగా సమర్పించుకొని ప్రాయశ్చిత్తము చేసెననియు, బృహదారణ్య కోపనిషత్తు నందు-

"సోకామయతే మేధ్యంమ ఇందస్స్యాత్ ఆత్మస్య నేనస్స్యామ్" అనగా నతడు యజ్ఞములకు తగిన రూపమును ధరించుకొన వలెనని కోరుకొనెననియు, ఋగ్వేదమందు -

**శ్రు॥ విశ్వకర్మా సర్వాణి భూతాని జుహవాంచకార॥ స ఆత్మామంతతో జుహవాంచకార॥**

అనగా సృష్టికర్త సకల సృష్టములను బలిగనిచ్చి తుదకు తానే బలిగ నర్పించుకొనెననియు వ్రాయబడుటచే లోకాధిపతి యగు నా పరాత్పరుడు మర్త్యామర్త్యమును వహించి, దైవ మానవుడై యవతరించి ఈ భూలోక మందు తానే యజ్ఞపశువై మానవులను తరింపజేయుటకై యజ్ఞమగుటయే నిజమగు ముక్తిదాయకమగు మహాయజ్ఞమని తెలియుచున్నది.

దేవుడు భూలోకమందు అవతరించినగదా ఆయన పాప ప్రాయశ్చిత్తార్ధ బలిగా - తానే బలిగ అర్పించుకొనుట అని యందురేని దేవునికి అవతారమున్నట్టు వేదశాస్త్రములే సాక్ష్యమిచ్చుచున్నవి. (ఋగ్వేదములోని 10వ మం॥ 90వ సూక్త7వ ఋక్కునందు)

**శ్రు॥ అజాయ మానో బహుధా విజాయతే॥ తస్యధీరాః పరిజానంతియోనిమ్॥**

అనగా జన్మింపనివాడు తరచుగా జన్మించుచున్నాడు. దానియొక్క కారణమును పండితులు తెలిసికొనుచున్నారు. దీనినిబట్టి దేవునికవతారమున్నట్లు తెలియుచున్నది. ఈ మంత్రమును అవతారపరముగానే మధ్వ రామానుజా చార్యులు భాష్యమందు వ్రాసిరి. ఈ ఋక్కుతైత్తెయారణ్యకము 3వ ప్రపాఠకమందును,శుక్ల యజుర్వేదముయొక్క 31వ మండల మందును, అధర్వవేదముయొక్క 19వ కాండ మందును ఉన్నది.

"నారాయణ" శబ్దార్ధములోనే దేవుడవతార మెత్తునను విషయము స్పష్టమగుచున్నది. "నరస్సేదం నాశం అవ తారేషు నారంవపురయితి నారాయణః" (గురుబాల ప్రబోధిక) నరసంబంధమైన శరీరము నారము; అవతారములయందు నరశీరరమును బొందువాడు నారాయణుడని భావము. మరియు 'స్వయంభువు' శబ్దార్ధమునుబట్టి (యంః స్వయం భవతి సస్వయాం భూరీశ్వరః) తనంతటతానే పుట్టినవాడు, ఎవనినుండిగాని, దేని నుండిగాని యుత్పన్నమైనవాడు కాదు; కాబట్టి పరమాత్మకు 'స్వయంభు'వని పేరు. దేవుడు సర్వశక్తిమంతుడు గనుక అవసరమైనయెడల అవతరించ గలడు. మృత్యువునొంది మృతిని గెల్వగలడు గనుక మృత్యుంజ యుడనియు ఆయనకు పేరు గలదు.

**ప్రశ్న :** నేపదార్ధముయొక్క స్వరూప మేక దేశీయమో దాని గుణకర్మ స్వభావములను ఏక దేశీయములగునుగదా? అటులేనియతడు ఈశ్వరుడు కాజాలడు. ఎందుకనగా ఈశ్వరుడు సర్వవ్యాపకుడుకదా?

**జవాబు :** దేవుడు పరలోకమందు స్థిరముగనున్నను వేగముగ పరుగెత్తుచున్న నితర వస్తువులను అతిక్రమించు

(సశేషం)

# ధవళ సింహాసనము

3

**యేసు రక్తమే జయం - ప్రభుయేసు రక్తమే జయం**

**బెలియల్ :** దేవదేవుడు ప్రస్తుతింపబడుచుండ
ఆయన కీర్తింప బడుచుండ
ఆయన ఆరాధింపబడుచుండ
ఆయన పూజింపబడుచుండ
మనమందరము "ఆమెన్" అనవలసిందే

**మిఖాయేలు :** అంతియే కాదు.... లూసిఫర్ ! పరిమళహోమ ధూపము... అనగా జటామాంసి, గోపి చందనము అచ్చమైన గోపరసమును, సుగంధములుగల లవంగిపట్ట, గంధపు చెక్క, స్వచ్ఛమైన సాంబ్రాణి, నిమ్మగడ్డి నూనె, ఓలీవ నూనె, ఆ దైవమునకర్పించుబడుచుండ... దూతగణములు ఆ అద్వితీయునికి పాదాభివందనములు చేయుచుండ ఓ ప్రధాన కెరూబూ నీవు కదా ఈ క్రతువునాచరించవలసింది. కావున

**మ్యామన్ :** కావున, ఆయన ఈ అష్టైశ్వర్యములతో, భోగ భాగ్యములతో తులతూగుచుండవలె. మనము శాశ్వతకాలము ఆయన ఏలుబడిలో ఆయన అదుపాజ్ఞల క్రింద పడియుండవలె? అంతేనా నీవు చెప్పదలచినది?

**గబ్రియేలు :** ప్రియ మ్యామన్ ! నీకేమి సంభవించినది? నీవు నిజముగా లూసిఫర్ హితుడవా? అట్లయిన ఇట్టి పరుషపు మాటలతో, అపాయకరమైన వ్యాఖ్యలతో అతని రెచ్చగొట్టవు. యెహోవా ఉగ్రతకు అతని గురిచేయవు.

**బీల్జబబ్ :** అయినా నీవు చెప్పునదేమి? మ్యామన్ పలికిన మాటలు లోపభూయిష్టములా? మా సలహాలు, అభిప్రాయాలు కర్క షములును అపాయకరములా? మేమేమి చెప్పినను పరుషముగా, వొల్లని మాటలుగా తోచుచున్నవా? మీ ప్రవర్తన మమ్ము ఎల్లవేళ కించపరచేదిగా ఉంటుంది. ఈ ధోరణిని యిక ముందెన్నడు ఉపేక్షించబోము. మీరు సంయమనము వహించుట మీకెంతో శ్రేయస్కరము. లేనిచో మా శక్తి సామర్థ్యములు రుచి చూడవలసి ఉంటుంది జాగ్రత్త (కత్తి దూయును)

**మిఖాయేలు :** (కత్తి దూయుచూ) బీల్జబబ్! ఏమి నీవాచాలత? భీరులెవరిచట? నీవు నీ మృగబలమున దివ్య లోకపాలనను అదుపు చేయలేవు. యెహోవా కోపము మహావేంద్రమైనది. అద్వితీయుని ఆరాధకుడవు నీవు. అంతరించిపోగలవు. నాశనమునకు ముందు గర్వము నడచును. పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచునని గ్రహించుము.

**బెలియల్ :** ఇది సత్యము బీల్జబబ్! మిఖాయేలు మాట మిన్నయని గ్రహించుము

**బీల్జబబ్ :** చాలించు నీ అధిక ప్రసంగము. ఎవరు మిన్న ఎవరు చిన్న ఒకరితోనొకరు తలపడినపుడు బయల్పడును. అధముల సలహాను నేను పాటించను.

**లూసిఫర్ :** భీరుల పలుకులు మనస్కరించకు. ఈ దివ్యలోకమున నీవు ఒంటరివాడవు కానే కాదు. వేలాది దూతలు నీవెన్నంటి యున్నారు.

**గబ్రియేలు :** వినాశకాలే విపరీతబుద్ధి. నీ అహంకారము వల్ల నీస్నేహితునికి ముప్పుతేకు.

**లూసిఫర్ :** ఆపండి.. ఆపండి.. కర్ణకఠోరమైన మీ వాక్కుల విన నావశముగాకున్నది. నేను ద్వితీయుడను.. ద్వితీయుడను హీన భావము, మాననివ్రణమై నన్ను వేధించుచున్నది. పరిశుద్ధుల స్తుతులు, స్తోత్రాలు, దూతగణముల గాన ప్రతిగానాలు, భక్తకోటి ప్రస్తుతి గీతాలు అహో!!! నామనశ్శాంతిని హరించివేస్తున్నాయి. ఈర్ష్యా, ద్వేషాగ్నిజ్వాల నామదిని దహించివేయుచున్నది. మహోన్నతుని సింహాసనము నధిష్టించవలెనన్న వాంఛ అంత కంతకు మిక్కుటమై నా బ్రతుకును దుర్భరము చేయుచున్నది.

ఈ నిరాశ నిస్పృహల భరింప నాకే మాత్రము శక్తిలేదు, సహనము లేదు. అబ్బా !! ఇక క్షణముపేక్షించలేను. ఈ అంతర్మ ధనం నే భరించజాల. నేనేమాత్రము భరించ జాల ఇక తడవు సేయక యెహోవా మీద సమరము చేసెద. దూతల సమూహ మునకు భీతికల్పించెద. దివ్యలోకపునాదుల కదిలించెదదాని కాలభ్రమణము తలక్రిందులు చేసి శాంతి సమాధానాలను కొల్లగొట్టెద. అడ్డగించిన వారి హతమార్చెద. ఎదిరించిన వారి ఎదలు చీల్చెద. నాకోపాగ్ని జ్వాలాగ్నికీలల పరమును వల్లకాడుగా మార్చి, హాహాకారము సృష్టించెద. ధవళ సింహాసనము ఆక్రమించెద. నేను ఆకాశమునకు ఎక్కి పోయెదను దేవుని నక్షత్రములకు పైగా నా సింహాసనమును హెచ్చించె దను. ఉత్తర దిక్కున సభాపర్వతము మీద కూర్చుండెదను. మహోన్నమనితో సమానంగా చేసికొందును. అహ్హ.. అహ్హ.. అహ్హ..

**యెహోవా :** ఓయీ! అసూయాపరుడా! పూర్ణ జ్ఞానమును సంపూర్ణ సౌందర్యము గల కట్టడమునకు నీవు మాదిరివి. దేవునితోటయగు "ఏదేను"లో నీవుంటివి. మాణిక్యము, గోమేధికము, సూర్యకాంత మణి, రక్తవర్ణపరాయి, శులిమానిరాయి, మరకతము, నీలము, పద్మరాగము అను అమూల్యరత్నములలోను బంగారముతోను నీవు అలంకరింపబడియున్నావు.

**లూసీఫర్ :** ఇన్నియున్నను, స్వేచ్ఛ స్వాతంత్ర్యములు శూన్యము.

(సశేషం)

మార్గదర్శి

# బ్రదర్ భక్తసింగ్

సహోదరుడు తన మాతృభాషనందే కాక ఆంగ్ల భాష నందు మంచి అనుభవం కలవాడు. బ్రదర్‌భక్తసింగ్ ఆంగ్ల వర్తమానాలు, ఆయన రచించిన పుస్తకాలు యిందుకు నిదర్శనం.జాతి, మత కుల ప్రాంతీయ భేదాలు తెలియని వాడు. భాష, కులం, రాష్ట్రాల మార్పిడిలు చేసి అనేకమందికి సహోదరుడు వివాహాలు చేశాడు. బ్రదర్‌కి సంగీతమునందు అనుభవం లేదు. అయితే సంగీతప్రియుడు. దేవునికి సంబంధించిన గొప్ప దైవజనుల పుస్తకాల్ని చదవడం ఆయనకు అలవాటు. బ్రదర్ సువార్త చెబుతుంటే చెంపమీద కొట్టినట్లుంటుంది. ఆయన స్వరం వేరు.

**<u>అంకితభావం :</u>**

ఎన్నికష్టాలు, నిందలు, అవమానాలు, శ్రమలు వచ్చినా వాటిని ఎదుర్కొని, అప్పగించిన పనిని చిత్తశుద్ధితో నమ్మకంగా చేయడమే అంకితభావం.

సహోదరుడు భక్తసింగ్ రక్షింపబడ్డనాటి నుండి ప్రభువైన ఏసుక్రీస్తుకు నమ్మకంగా అంకితభావంతో సువార్త పరిచర్యను చేశాడు. ప్రభువు తనని రక్షించిన ఉద్దేశానుసారంగా తన జీవితయాత్రను కొనసాగించాడు. ప్రభువు సేవలో అలుపు లేకుండ పయనించిన అమరజీవి.రక్షింపబడ్డ మొదటి దినాల్లో ఎన్నో ఆటంకాలు, ఆర్ధిక పరిస్థితులు వెంటాడినా ప్రభువుపై భారముంచి విశ్వాసంతో ముందుకు సాగిపోయిన దైవజనుడు బ్రదర్‌భక్తసింగ్. ప్రభువునకు నమ్మకంగా జీవించిన అపోస్తులుడు.

ఒకసారి తమిళనాడులోని 'టుటికోరియం' లో ఒక వివాహం చేయడానికి సహోదరుడు వెళ్ళాడు. బ్రదర్ వస్తున్నట్లు తెలిసికొన్న విశ్వాసులు, అవిశ్వాసులు చాలామంది ఆ వివాహానికి వచ్చారు. ఆదినం బ్రదర్ పంటినొప్పిచే బాధ పడుతున్నాడు. తెరవడానికి నోరు సరీగా రావడంలేదు. అయితే ఆదినం ప్రభువు బ్రదర్‌ని బలంగా వాడుకొన్నాడు. ఆ పంటి నొప్పితోటే దాదాపు రెండుగంటలు వాక్యాన్ని అందించాడు. ఎంతో మంది ఆ దినం ప్రభువుని అంగీకరించారు. ఆదినం అన్నం తినలేదు. అంకితభావంతో పనిచేయడం ఆ దైవజనుడుకే తగును. నిద్రాహారాలు లేకపోయినా వ్యాధిబాధలెన్ని ఎదురైనా సువార్తను చేయడం మానడు. తన సుఖం కంటె ప్రభువు మహిమ పొందడం తనకు ముఖ్యం. ఒకదినం గుంటూరుజిల్లా నరసాయిపాలెంలో సువార్త పరిచర్యకు వెళ్లారు. రోడ్డు చాలా భయంకరంగా ఉంది. గుంటమిట్టలు, ఎగుడు దిగుడులుగా రోడ్డు ఉన్నప్పటికి, ఒకట్రక్కులో బయలు దేరాడు. ఆరాత్రి 12 గంటలవరకు వర్తమానం యిచ్చాడు. తరువాత భోజనం చేసి అందరు నిద్రపోయారు. కాని సహోదరుడు మాత్రం నిద్రపోకుండ తెల్లవారి 5 గంటలవరకు ప్రార్థించాడు. అందరు అదే ట్రక్కులో ప్రయాసంతో ప్రయాణం చేశారు, అందరు వర్తమానం కోసం 12 గంటలవరకు మేల్కొకొన్నారు, అందరూ అదే భోజనాన్ని తిన్నారు, అయితే అందరు నిద్రించినా సహో దరుడు మాత్రం తెల్లవారేంతవరకు ప్రార్థనలో గడపడం గమనిస్తే సేవపట్ల బ్రదర్‌కు ఉన్న అంకితభావం వ్యక్తమవుతుంది.

ఒకసారి విజయవాడ నుండి ఒక గ్రామానికి వర్తమాన మివ్వడానికి జీపులో బయలుదేరాడు. కొంతదూరం పోయిన తరువాత టైరు పంచరైంది. అది రాత్రి 8 గంటల సమయం. టైరు పంచరు వేయడానికి రెండు మూడు గంటలు సమయం పట్టవచ్చును. బ్రదర్ భక్తసింగ్ వరుస ప్రయాణాల వల్ల అలసిపోయాడు. అందువల్ల రోడ్డు ప్రక్కన ఒక కాలువ ఒడ్డున నల్లటి మట్టిపై ఒక గుడ్డను పరవగా సహోదరుడు కొంతసేపు విశ్రాంతి తీసికొన్నాడు. అక్కడ దోమలు అధికంగా ఉన్నాయి. కాబట్టి దేవుని పనిలో సుఖాన్ని కోరని వ్యక్తని తెలుస్తుంది. నమ్మకమైన సేవకునిగా, ఉపదేశకునిగా ప్రభువు అప్పగించిన పనిని అంకితభావంతో పనిచేశాడని తెలుస్తుంది.

ప్రతి సంవత్సరం తన ప్రతిసంఘాన్ని దర్శించేవాడు. ఆయా స్థలాల్లో సంఘాల్లో వున్న పరిస్థితులిన్న తెలిసికొనేవాడు. ఎవరైన దేవుని క్రమమునుండి తొలగినట్లైతే వాళ్లని వాక్యముచే గద్దించి, నిజమైన గ్రహింపును వాళ్లకి కలిగించేవాడు. వాళ్ల ఆత్మ క్షేమం సంఘ ఐక్యత కోసం ప్రార్థించేవాడు. నిద్రాహారాలు మాని రాత్రింబగళ్ళు ప్రయాణంచేసి మారుమూల వున్న సంఘాల్ని కూడ దర్శించి అంకితభావంతో తన కర్తవ్యాన్ని నెరవేర్చేవాడు. అంతేకాదు సంఘానికి కావలిసిన హెచ్చరికల్ని ఇచ్చేవాడు. ఆత్మల క్షేమం అంతేకాదు సంఘానికి కావలసిన హెచ్చరికల్ని ఇచ్చేవాడు. ఆత్మల క్షేమం కోసం ఆరాటపడేవాడు. బ్రదర్ భక్తసింగ్ యేసుప్రభువునకు నమ్మకమైన ఒక పనిముట్టు. కొన్ని సంవత్సరాల క్రితం బీహారులో సందర్శించేటప్పుడు 'లూరు' అనే గ్రామానికి ఎండలో మూడు మైళ్లు నడచి పోయి వర్తమానం ఇచ్చి తిరిగి నడచి వచ్చాడు. ఇటువంటి అనుభవాలు ఆ దైవజనుడికి ఎన్నో!

(సశేషం)

# మదర్ థెరిస్సా

జీవముగల దేవుడైన యేసుప్రభువు నామమున మీకు శుభములు. బైబిలు గ్రంథములో ఎందరో జీవిత చరిత్రలను చూస్తాము. వారిపట్ల దేవుని ప్రణాళిక ఏమైవున్నదో గమనించ గలము. మనము ప్రార్థనాపూర్వకముగా దేవుని నడిపింపును కోరుకుంటే మనకు అపారమైన జ్ఞానము చేకూరి నిత్యజీవము నకై ఊరెడి నీటిబుగ్గగా వుండునని యేసుప్రభువు చెప్పారు (యోహాను 4:14).

పాతనిబంధన గ్రంథములో ఆదాము, నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపు, మోషే, యెహోషువ, దావీదు మరియు సొలొమోను, ఏలియా మరియు ఎలీషా ప్రవక్తలు వారి జీవిత చరిత్రలను చూడగలము. క్రొత్తనిబంధన గ్రంథములో అపొస్తలుడైన పౌలు జీవితము, ప్రభువైన యేసుచరిత్ర విశదీకరించబడినది. కొడవటికంటిగారు వ్రాసిన నవలలు చదివితే దేవుని ప్రణాళికలు వారి జీవితాల్లో ఎలా వున్నాయో, మన జీవితము పట్ల ప్రభువు ప్రణాళిక ఏమైవున్నదో తెలుసుకొనవచ్చును.

మదర్ థెరిస్సా జీవితముపట్ల ప్రభువుకున్న ప్రణాళి కేమిటో ఆమె జీవితములోని కొన్ని ఘట్టాలను చూస్తే మనకు అర్థమ వుతుంది. మొదటగా ఆమె జన్మము, బాల్యదశ, ప్రేరన, ఆమె కుటుంబము, బారతదేశానికి వచ్చిన విధము, భారత దేశములో ఆమె జీవితం సాగిన విధానము, నిర్భాగ్యులకు సేవ చెయ్యమని మరో పిలుపు "పిలుపులో పిలుపు", ఆమె ఆరంభసేవలో పడిన కష్టాలు, పరిణితి చెందిన దైవసేవకు రాలిగా ఆమె సేవ, వివిధ దేశాలకు సేవ వ్యాప్తిచెందడం, ఆమెకు లభించిన బహుమతులు, చివరగా ఆమె జీవితము ద్వారా యేసుప్రభువు ప్రేమ లోకానికి తెలుపబడి మహిమపరచబడిన విషయాలు.

మదర్ థెరిస్సా జీవిత చరిత్ర చదివి నేను ఎంతో ఆదరణ పొంది ఆత్మీయ అభివృద్ధి చెందాను. నేను దేవుని ఎరుగుటకు మొట్టమొదటి మెట్టు మెదర్ థెరిస్సా జీవితము ద్వారా అని చెప్పుటకు సంతోషిస్తున్నాను. ప్రభువైన యేసు చిత్తమును ఎరిగి తనపై ఉంచిన పనిని సంపూర్ణముగా నెరవేర్చి భూమి మీద ప్రభువును మహిమపరచినది (యోహాను 17:4).

మదర్ థెరిస్సా జన్మదినం ఆగష్టు 26, 1910. ఇప్పటి ఎలక్షన్ కమీషనర్‌గా వున్న నవీన్‌చావ్లాగారి ఆర్టికల్ 2007 ఆగష్టు 26న దిహిందూ దినపత్రికలో చదివాను. ఆయన మదర్ థెరిస్సా జీవితచరిత్రను వ్రాశారు. ఆయన కుమార్తె అయిన రుక్మిణి చావ్లాగారు 'Apostle of Love - The Life of Mother Theressa' అనే పుస్తకాన్ని వ్రాశారు. జూలై 2001 నెలలో కొడవటికంటిగారితో మదర్ థెరిస్సా జీవిత విశేషాలను చెప్పినప్పుడు, అందరూ తెలుసుకునేటట్లు వ్రాయమని ప్రోత్సహిం చారు. నాలుగు నెలల తరువాత దేవుని ప్రేరణతో మొదలు పెట్టాను. ఈ మధ్య యశోద హాస్పిటల్‌కి వెళ్లాను. ప్రతి అంతస్తులో మదర్ థెరిస్సా ఫోటో ఉంది. దాని క్రింద "గొప్ప పనులను మనము చెయ్యలేకపోవచ్చు కాని, చిన్న పనులనైనా గొప్ప ప్రేమతో చెయ్యవచ్చు" అని వ్రాసివుంది. ఇది ఆమె నమ్మిన సిద్ధాంతం. మదర్ థెరిస్సా అతి సామాన్య మైన జీవితాన్ని గడిపారు. కరుణ, జాలి, మంచితనాలకు దర్పణమైన త్యాగశీలంతో నిండిన జీవితం ఆమెది. ఆమె చేసిన విశిష్టమైన ప్రార్థన ఏమిటంటే "The fruit of silence is prayer, the fruit of prayer is faith, the fruit of faith is Love, the fruit of love is service, the fruit of service is Peace"**.** ప్రార్థన లేకుండా ఏ సేవను కూడా తలపెట్టలేము. యేసుక్రీస్తు దేవుడై వుండి కూడా తండ్రితో ప్రార్థనలో గడిపినట్లు చూస్తాము. ప్రార్థన ద్వారా మదర్ థెరిస్సా దేవుని చేరుకుని ఆయన ద్వారా శక్తిని, ఆయన చూపించే మార్గాన్ని, ప్రేమను పొందగోరేది. ప్రార్థన ద్వారా ఆయన ప్రసాదించిన ప్రేమకు కృతజ్ఞతలు తెలియజేసేది. ఎవరి మతం ఏదైనా వారి పూర్ణ హృదయంతో దేవుడిని ప్రార్థించాలి అని చెప్పేది. ఆమె మానవు లందరి గురించి ప్రార్థించేది. మరి ముఖ్యంగా పేదవారి కొరకు. ఎందుకంటే వారికే గదా దేవుని సహాయం కావల్సింది. ప్రార్థనలో మునిగిన మదర్ థెరిస్సాకు ఆనందము, సంతోష ములు కలిగి విశ్వాసానికి దారితీసేవి. మదర్ థెరిసా జీవితము దేవునికి

పూర్తిగా సమర్పించబడిన జీవితము సజీవయాగమైన జీవితము. ఆ విశ్వాసముతోనే చిన్నవయస్సులో ఇంటిని, తన వారినందరిని వదలి దూర ప్రాంతాలకి వచ్చి ఎన్నో కష్టాలు, బాధలు అను భవించడానికి దోహదపడింది. ఈ దృఢవిశ్వాసం తోనే ఆమె తాను కన్న కలలను హృదయపూర్వకంగా నెరవేర్చగలిగింది. ఆమె ఎప్పుడు నిరుత్సాహపడలేదు. తన పనిని మధ్యలో వదలి వేయలేదు. అటువంటి విశ్వాసంతోనే ఆమె ఒక సంస్థను ప్రారంభించి పెద్దదిగా అగుటకు దోహదపడింది. తానొక్కతే కలకత్తా మురికి వాడలో ప్రారంభించిన సేవ ప్రపంచ వ్యాప్తి చెందిన సంస్థగా ఎదిగిందంటే అది ఆమెకు దేవుని యెడల వున్న అచంచల విశ్వాసమే.

పరిశుద్ధుడైన పౌలు 1కొరింధి. 13వ అధ్యాయంలో చెప్పినట్లు ప్రేమ అన్నిటికంటే గొప్పది. ప్రేమాస్వరూపియైన దేవుని స్వరూపమందు నిర్మించబడిన వారు ఆయన ప్రేమను అద్దము వలె ప్రతిఫలింపజేయువారి యెడల ఆయన ఆనందించును. తాను చూచిన తన సహోదరుని ప్రేమించని వాడు తాను చూడని దేవుని ప్రేమించలేడు (1యోహాను 4:20,21, 5:12). మన కొరకు ప్రేమ కొనబడింది. దానికి మూల్యం ప్రభువైన యేసు ద్వారా చెల్లించబడింది. అడిగిన వారికి అది దొరుకుతుంది. ఇతరుల అవసరమును, శ్రమలను గుర్తించే కన్నులను దేవుడు మనకిచ్చాడు. మేలు చేసే చేతులను ఇచ్చాడు. అన్నిటికంటే ప్రేమతో పొర్లిపారే హృదయాన్ని మనకిచ్చాడు. మదర్ థెరిస్సా పరిచర్య అంతా ప్రేమతో కూడినది. ఆమె తీసుకున్న ప్రతి నిర్ణయమూ దేవునిపై ఆమెకున్న ప్రేమ వలననే. ఆమె ప్రతి పేదవారిని ప్రేమించేది. ఆమె దృష్టిలో పేదవారు దేవునిలో అంతర్భాగమే. ఎవరు ఏ తప్పుచేసినా ఎవరికీ తీర్పు తీర్చలేదు. క్షమాపణ, శాంతియుత ప్రేమాయుతమైన దారిలో నడిచిన జీవితం ఆమెది. ఆమె కల ప్రేమతో కూడిన కల, పరిశుద్ధమైన హృదయంతో ప్రేమ కొరకు జీవించినందున మదర్ థెరిస్సా జయకేతనం చేసింది. పేదలకు సేవ చేయునప్పుడు సంతోషంతో, హృదయంలో ఆనందం విలసిల్లేటట్లు అనుభవం పొందేది. పేదలకు సేవ చేసే అవకాశాన్నిచ్చిన యేసుప్రభువుకు కృతజ్ఞతలు తెలియజేసేది. ఆమె జీవితము సేవామయమైన నిస్వార్ధ జీవితం. ఏనాడూ ఎటువంటి ప్రతిఫలాన్ని కోరు కోకుండా, తాను చేసేదంతా శ్రమలనుభవించి యేసయ్యకే చేస్తున్నట్లు సంతోషించేది. కొన్ని లక్షల డబ్బు ఇచ్చినా చేయలేని సేవ, యేసు ప్రేమ కొరకై చేస్తున్నాను అనేది. సేవ చేయుట ద్వారా డబ్బునుగాని, ఖ్యాతినిగాని ఆశించలేదు. దేవుని చిత్తాను సారము పేదలకు సేవ చేసే భాగ్యం ఇవ్వబడిందని అందువల్ల తన జీవితం ఓ అందమైన ఆనందమయమైన జీవితమని చెప్పేది.

ప్రపంచమంతటా పేదరికం, ఆకలితో జీవిస్తూ అందు లోనే మరణిస్తున్న అసంఖ్యాకుల కోసం నిత్యం ఆమె జరిపిన కృషి ఎందరికో ఆమె అడుగుజాడల్లో నడిచేందుకు ప్రేరణ కలిగించింది. మదర్ థెరిస్సా ప్రతిరోజూ తొమ్మిది వేలమందికి వంట చేయించే వారు. ఏ రోజైనా వంట చేయలేదంటే తొమ్మిది వేలమంది తినలేదన్నమాటే. ఒకరోజు నూతన వధూవరుల జంట మదర్ థెరిస్సాకు పెద్ద మొత్తంలో డబ్బు ఇచ్చినప్పుడు ఎందుకు ఇస్తున్నారని అడిగితే, వాళ్ళేం చెప్పారంటే "రెండు రోజుల క్రితమే మా వివాహమయ్యింది. వివాహానికి ముందే మేము తీసుకున్న నిర్ణయమేమంటే వివాహ విందు లేకుండా, ఆ డబ్బుతో పేదవారికి భోజనం పెట్టాలని నిర్ణయించుకున్నాం" అని చెప్పారు. ఎందుకలా చేస్తున్నారని మదర్ అడిగితే వారి సమాధానం ఏమంటే "మేమిద్దరం ఒకరినొకరం ప్రేమించు కున్నాం కాబట్టి మా వివాహ జీవితాన్ని త్యాగపూరితమైన ఈ చర్య ద్వారా ప్రారంభించాలనుకున్నాం" అని చెప్పారంట. వారిద్దరూ ఉన్నతమైన హిందూ కులంలో పుట్టి ఈ పేదవారి గురించి ఆలోచించేంత అవసరంలేని వారు. ప్రభువు ప్రేమా మయుడు. యేసుప్రభువు ప్రేమ అందరిలో ఉండి వ్యాపిస్తుంది గదా అనుకున్నది మదర్ థెరిస్సా. (సశేషం)

**ఫిబ్రవరి నుండి చిన్న పిల్లల కొరకు ఒక శీర్షిక ప్రారంభిస్తున్నాము. మీకు తెలిసిన చిన్నపిల్లల కథలు, సాక్ష్యములు, పిల్లలతో మీకున్న ఆత్మీయ అనుభవాలను మాకు పంపించినచో ప్రచురించెదము. తద్వారా పిల్లలు దేవునిలో ఎదుగుటకు సహాయపడిన వారగుదురు. -ఎడిటర్**

సాక్ష్యము

# లక్ష్మీ నలంద

## (శ్రీ నిమ్మగడ్డి సత్యాచారి సాల్మన్‌రాజుగారి సాక్ష్యము)

(గత సంచిక తరువాయి.....)

ఉదయాన్నే సాల్మన్‌రాజుగారు ఒంటరిగా చర్చికి వెళ్తూ జనం మధ్యలో కనిపించాడు, కాని ఒంటరిగా సమాధుల మధ్య నడిచేటప్పుడు దేవుని శక్తి వలన వారి కళ్ళకు ఆయన కనబడలేదు. ఆ విధంగా ఆయనకు కీడు తలపెట్టిన వారినుండి దేవుడు సాల్మన్‌రాజుగారిని కాపాడాడు.

------

2004 జూన్ 6న వారి వివాహ సిల్వర్ జూబ్లి జరిగింది. జూన్ 7న విజయవాడలో ఒక వివాహమునకు లక్ష్మీనలంద హాజరయింది. 8న పెద్దబాబు పుట్టినరోజు. సాయంకాలం ఒంగోలు నుండి తన పెనిమిటి సాల్మన్‌రాజు గారు సాయంకాలానికి ఒంగోలు రావాలని ఫోన్ చేసారు కాని కొన్ని కారణాల వల్ల ఆ సాయంకాలం ఒంగోలు చేరకుండా మరునాడు ఉదయం 6 గంటలకు తన అన్నగారి 16 సంవత్సరాల కుమార్తె పావనిని వెంటబెట్టుకొని పినాకినిలో ఒంగోలు బయలుదేరారు 8-20కి పినాకిని ఒంగోలు చేరింది. బి.పి.కొంచెం ఎక్కువగా ఉన్నందున కండ్లు మూసుకొని కిటికి ప్రక్కన కూర్చుంది. ఒంగోలు స్టేషన్ నుండి రైలు మరల బయలుదేరినప్పుడు కండ్లు తెరచి చూస్తే బండి ఫ్లాట్‌ఫారం దాటి వెళ్తున్నది. అయినా ఏమి తొందర పడకుండా శింగరాయ కొండలో దిగి వెనక్కి ఒంగోలు వస్తాము అని తన మేన కోడలుతో చెప్పి, లేచి వాకిలి వద్దకు వెళ్ళి కొంచెంసేపు వెనక్కు వెళుతున్న స్టేషన్ చూచి సీటు వద్దకు వెళ్ళటానికి వెనక్కి తిరగబోతుండగా ఎవరో గట్టిగా బయటకి తోసివేసి నట్లుగా రైలు పెట్టెలో నుండి బయటకు పడిపోయింది. రైల్లోని వారు గొలుసు లాగినా కూడ రైలు ఆగలేదు. అయితే రైలులో ఉన్నవారు ఆమె మేనకోడలు పావనికి సెల్ ఇచ్చి విజయ వాడలో ఉన్న ఆమె తండ్రికి ఫోన్ చేసి చెప్పించారు. ఆ అమ్మా యిని సింగరాయకొండలో రైలు దించి ఒంగోలు పంపించారు.

రైలులో నుండి క్రిందపడిన నలందా శరీరమంతా గాయాలతో పడివుంది. చలనం లేకుండ పడివున్న నలందను చూచిన వారు ఆమె చనిపోయిందని తలంచారు. కాని ఎముకలు విరిగిన చెయ్యి కొంచెం కదలటం చూచి ఆమె దగ్గరగా వచ్చినప్పుడు ఆర్.టి.సి.రీజనల్ మేనేజరు సాల్మన్ రాజుగారు అని చెప్పి ఆయన సెల్‌నెంబర్ చెప్పి ఇక మాట్లాడ లేదు. రైల్వే పోలీసులు వచ్చి ట్రాలీలో ఆమెను ఎక్కించి, ఆటోలో వెంటనే ఆమెను గవర్నమెంటు ఆస్పత్రికి తీసికొని వెళ్ళారు. సింగరాయకొండ నుండి పావని కూడ గవర్నమెంటు ఆస్పత్రి చేరింది. నలందగారు రైలునుండి పడిన సమయంలో గన్నవరంలో స్త్రీలకూటం జరుగుచున్నది. ఆ కూటములో ఓ స్త్రీ లేచి 'బ్రదర్, నేను దర్శనంలో ఒక స్త్రీ రైలు నుండి క్రిందపడినట్లు, ప్రార్థన చెయ్యమని అడుగు చున్నది' అన్నది. 'ఇప్పుడు కూర్చోమ్మా, కూటము అయిన తర్వాత మాట్లాడదాం' అన్నాడు డేవిడ్‌రాజుగారు. కూటము అయిపోయిన తర్వాత దర్శనం వచ్చిన స్త్రీ 'మా యింట్లో ఎవరో అపాయంలో ఉన్నారు ప్రార్థించండి' అన్నది. ఇంతలో నలంద తమ్ముడు డేవిడ్‌రాజు గారికి ఫోన్ చేసి 'మా అక్క ఒంగోల్లో రైలు నుండి పడిపోయింది ప్రార్థించండి' అని అడిగాడు.

ఒంగోలు సెయింట్ జేవియర్స్ స్కూల్ టీచర్ గారైన రోజమ్మగారికి సాల్మన్‌రాజుగారు ఫోన్ చేసి జరిగిన సంగతి చెప్పి గవర్నమెంట్ హాస్పటల్‌కి వచ్చారు. రోజమ్మగారు, వారి స్టాఫ్ అందరూ హాస్పిటల్‌కి వచ్చారు. వారిని చూచిన నలంద అపస్మారక స్థితిలోనే 'విలియం ఫాదర్ వచ్చారా? అని అడిగింది. అప్పటికే ఆయన చనిపోయి పధ్నాలుగు సంవత్సరాలు గడిచాయి. ఆయన ప్రార్థన చేస్తే స్వస్థత కలుగుతుందని నలంద నమ్మకం. మరణించే ముందు ఇచ్చే 'అవస్థా అభ్యంగనము' అడిగింది. పళ్ళన్ని ఊడిపోయి నోరంతా నెత్తురుతో ఉన్నందున పూర్తి అభ్యంగనము ఇవ్వలేదు.

పోలీసు వారు ఆమెను ఏవేవో ప్రశ్నలు అడుగు తున్నారు 'మిమ్మల్ని ఎవరైనా బయటకు త్రోసివేశారా?' అని అడిగారు. 'ఎవరో బలంగా బయటికి తోసినట్లుగా అనిపించింది కాని మనుష్యులు కారు' అని చెప్పి తన చిన్న కుమారుని దగ్గరకు రమ్మని 'నాని (పెద్దకుమారుడు), నాన్న జాగ్రత్త ' అని అప్పగింతలు పెట్టి కళ్లు మూసుకుంది నలంద. డాక్టరు నాడి చూసి చెయ్యి వదిలాడు మరణించిందని.

అయితే గుంపులో నిలుచుని ఉన్న భర్త సాల్మన్‌రాజు గారు ఒక్క ఉదటున జనాన్ని నెట్టుకొని ముందుకు దూకి రెందు చేతులు నలంద మీదుగా చాచి, ఏదో తెలియని భాషలో

పెద్దగా మాట్లాడి, 'మరణదూతా, నువ్వు వెళ్ళిపో' అని అరచాడు. ఎక్కడో తెలియని ప్రాంతములో ఉన్న నలందకి ఆ స్వరం వినబడింది. మరలా 'మృత్యువా! యేసు నామమున నిన్ను శాసిస్తున్నాను' అని ఆయన పలకటం నలంద విన్నది. ఆమెకి మరలా శ్వాస ప్రారంభమైనది. డాక్టరు గబగబ వచ్చి ట్రీట్‌మెంట్ ప్రారంభించారు. ఇంటెన్సీవ్ కేర్‌లో వుంచి రెండ్రోజులు గడిస్తేకానీ చెప్పలేము అన్నారు.

అప్పటికి చాల కాలం క్రితం ఒక అవసరం నిమిత్తం ప్రావిడెంటు ఫండు లోను కొరకు సాల్మన్ రాజుగారు అప్లై చేసి యున్నారు. ఆ డబ్బు ఆ రోజే చేతికి వచ్చింది. నలందగారిని గుంటూరుకు అంబులెన్సులో ఒక నర్సు, ఒక డాక్టరుగారితో కలసి బయలు దేరారు. గుంటూరు హాస్పిటల్ వారు ఆమె రైలుక్రింద పడి ముక్కలు ముక్కలుగా అయివుంటుందనుకొని సిద్ధంగా ఉన్నారు. రక్తం కూడ సిద్ధం చేసారు. కాని ప్రభువు కృప వలన రక్తంతో పని లేక పోయింది.తుంటి ఎముకను తీసి చేతికి వేసారు. రెండు రోజుల వరకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచారు. కాలి కండలు తెగిపోయాయి. 14 రోజులు డాక్టరు గారే స్వయంగా బ్యాండేజ్ చేసారు. మెదడుకు తగిలిన దెబ్బవల్ల ఆమెకు నెప్పి తెలియలేదు. 15 రోజుల తర్వాత నొప్పి తెలియడం ప్రారంభమైనది. ఆమె కాళ్ళు చేతులు బ్యాండేజెస్‌లో ఉన్నప్పుడు – ఆమె మాటి మాటికి సిలువలో యేసు ప్రభువు కాళ్ళలో చేతులలో చీలలతో ఎంత బాధ పడినాడో అనుకొనేది.

ఒంగోలు వచ్చిన తర్వాత రోమన్ కాథలిక్ సిస్టర్స్ ఉండే చోట డాక్టరు గారి క్వార్టర్సు ఖాళీగా ఉన్నందున సాల్మన్‌రాజుగారి మీద గౌరవంతో ఆ క్వార్టర్స్‌లో నలందని ఉంచారు. అందువలన ఆమెకు ఏంతో మేలు కలిగినది.

అక్కడ చేరిన రెండవ రోజు ఒక స్త్రీ నలంద మంచం దగ్గరకు వచ్చి మోకరించి భాషలో ప్రార్ధించిన తర్వాత 'నీ పూర్వ నివాసము చీకటి ఆవరించినప్పుడు, స్థలం మార్చిడి చేసింది నేను కాదా?' 'నీ మెదడు ఛిద్రం అయినప్పుడు స్వస్థపరచింది నేనే కదా!' అని ఆమె భాషలో ప్రార్ధింస్తుంటే నందకు ఆ భాష అర్ధమైంది.

ఆరునెలలు ఇద్దరు సిస్టర్సు నలందాకు అటెండు అయ్యారు. ఆమెకు ఆరునెలలు ఫిజియోథెరపీ చికిత్స చేశారు. మొత్తంమీద దాదాపు ఒక సంవత్సరం తర్వాత ఆమె పూర్తిగా కోలుకొన్నారు. ఇదంతా గమనించిన కాలనీ వాసులు అనేక మంది ప్రభువును హత్తుకొన్నారు.

ఇప్పుడు సాల్మన్‌రాజుగారు కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. నేను వారింటికి వెళ్ళిన ప్రతిసారీ ఎవరో ఒక దైవజనులు వారింట్లో ఉండటం చూశాను. నెలంతట్లో పలుమార్లు వారింటికి ప్రభువు నామమున వచ్చే వారందరికీ నలందగారు ఎంతో ఓపికగా ఆతిధ్యమిస్తూ తనకు రైలు ప్రమాదం ద్వారా చేతికి, కాలికి, మెదడుకు సంభవించిన అవరోధాలను ప్రభువు కృప వలన అధిగ మించింది.

ప్రతిరోజూ ఉదయం 6 నుండి 8 గంటల వరకు స్టేషన్ రోడ్డులోవున్న రోమన్‌కాథలిక్ చర్చీ ఆరాధనలో పాల్గొంటారు. మరల సాయంత్రం రెండు గంటలు ఇంట్లో దేవున్ని ఆరాధిస్తారు. వారింటికి వచ్చే సువార్తికులకు, వచ్చే పత్రికలకు వారి ఆదాయం నుండి ఎంతో ఖర్చు చేస్తారు. అందువలన నేడు ఆ స్థాయి ఉద్యోగుల ఇళ్ళలో వుండే ఏ ఆడంబరాలు లేవు. అయినా వారింటి లోపలికి వచ్చువారు వెలుపలికి వెళ్ళువారు దీవించబడుదురు అన్న వాగ్దానం నెరవేరుట చూశాను. –కొడవటికంటి


## కొడవటికంటి నవలలు

1. మడిమెను పట్టుకొనినవాడు
2. జష్వత్వనేహు
3. ఆసెనతు
4. అపొస్తలుడు
5. బర్నబా
6. తిమోతి
7. నా చిత్తానుసారుడు
8. గుంటనుండి మింటికి
9. నా స్నేహితుడు
10. తోటలో పనివాడు
11. గోత్రకర్త
12. విశ్వాసంలో ఓ మెట్టు *
13. నా దూత *
14. సువార్తలలోని యేసు *

* పై రచనలు అన్ని ప్రముఖ క్రైస్తవ పుస్తకశాలలలో, పబ్లిషర్స్ వద్ద లభించును.

మూడు పత్రికలలో సీరియల్స్‌గా వచ్చుచున్నవి.

# విశ్వాసంలో ఓ మెట్టు

కోర్టుకాగితాలు తీసికొని తన స్నేహితులలో ముఖ్యుడు నిస్వార్థముగా స్నేహితులను ప్రేమించేవాడు. గవర్నమెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న నాగిశెట్టి విద్యాసాగర్ దగ్గరకి వెళ్ళాడు సామ్యేలు.

మరణించిన తన అక్క పెనిమిటి తనను వివాహ చేసు కోవడానికి అంగీకరించకపోవటం వలన చిన్నప్పటి నుండి తను పెంచిన పిల్లలు తనకు దూరమవుతారని అక్క ఫ్యామిలి పెన్షన్ తనకు ఇప్పించాలని కోర్టుకు వెళ్ళింది వాణి. 11 సంవత్సరాలు ఏ బావ తనని పెంచాడో ఆ సామ్యేలు మీద దావా వేసింది.

విద్యాసాగర్ గవర్నమెంటులో ఎ.పి.పి. కనుక ఒంగోలులో సి.వి. ని కలవమన్నాడు. చెరుకూరి వెంకటేశ్వర్లు గారు కేసు వకాల్తా తీసుకొన్నారు. మొట్టమొదటి వాయిదాకి వాణి నివసిస్తున్న ఊరివారు బంధువులు దాదాపు 50 మంది కోర్టుకు వచ్చారు. బహుశా ఇప్పుడే చాలా డబ్బు వస్తుంది అనుకొన్నారు కామాల తర్వాత వాయిదాకి 40మంది తర్వాత 30మంది ఒక్క సంవత్సరం తర్వాత వాణి ఒక్కతే తన అక్క పుష్పాంజలి ఏకైక కూమారైను మాత్రం వెంటబెట్టుకొని జిల్లాకోర్టుకు హాజర య్యేది.అలా మూడు సంవత్సరాలు కోర్టుచుట్టూ తిరిగి ఇక కోర్టుకు హాజరుకాలేదు.కేసు కొట్టి వేసారు.సామ్యేలు ఒక్కసారి కూడ కోర్టు హాలులో ప్రవేశించలేదు. ఇక అక్క కూతురును చాకలేక తన బావ సామ్యేలు వద్దకు పంపించింది.

చిన్నతనం నుండి నేకునాంబాద్‌లో జీవించి బీదల మధ్య బీదరికములో పెరిగిన హుస్సేనయ్య డాక్టరు గారికి గవర్న మెంటు లెప్రసి కంట్రోల్ యూనిట్‌లో పని చెయ్యడం చాలా అసహనంగా వుండేది. లగ్జరీకి లేక లగ్జరీ కలిగించే అలవాట్లు, గలవారికయితే ఈ ఉద్యోగం చాలా మంచిది. చిన్నప్పటి నుండి మనుష్యులకు సేవచేసే అలవాటు ఉన్న హుసేనయ్యగారికి ఊరక కారులో తిరుగుతూ నాన్‌మెడికల్ అసిస్టెంటులను పరిపాలించే ఉద్యోగం ఇష్టం లేకపోయింది. అందువలన జనరల్ మెడిసిన్‌కి వెళ్ళి పోవాలని నిశ్చయించుకున్నారు.

సామ్యేలు ఉద్యోగంలో చేరిన నాటనుండి ప్రతీరోజు డాక్టరుగారితో క్యాంపుకాని మరో పనిగాని ఉన్నందున సమయం సద్వినియోగమయ్యేది. ఇప్పుడు హుస్సేనయ్యగారు మారిపోయి నందున మరో మెడికల్ ఆఫీసరు కంభంలో కాపురముండక పోవటం వలన జీపును తన ఇంటివద్దనే ఉంచుకొని ఏమితోచక పానియము ఎక్కువగా తీసుకొనేవాడు సామ్యేలు.

1982 అక్టోబరు 6న సావిత్రి మరొక బహుమానం జయశీలినిని ఇచ్చినందున ఇప్పుడు సామ్యేలు తొమ్మిది మంది పిల్లల తండ్రి అయ్యాడు.

1983లో రామారావు గారి ప్రభుత్వంలో రిటైర్‌మెంటు వయస్సు 58సం॥ల నుండి 55కు తగ్గించి నందున మరికొన్ని కారణములవలన గవర్నమెంటు నాన్‌గజిటెడ్ ఉద్యోగస్తుల సమ్మె ప్రారంభమైనది. క్రొత్తగాఉద్యోగంలో చేరినందున సామ్యేలును సమ్మెనుండి వినాయించారు.

ఓ సాయంకాలం సామ్యేలు పెద్దకుమారుడు డానియేల్ 'నాన్న ఈ ఊరినుండి మనం ట్రాన్స్‌ఫర్ అవ్వమా?' అన్నాడు. నిజమే ఒంగోలు జీవితానికి కంభం జీవితానికి అన్నిట్లో వ్యతిరేకమే ఇక్కడ బ్రతకడం దుర్భరం.

ఇక్కడకి వచ్చినవారు ఎవరు బయటికి పోలేరు. ఎందు కంటే స్థానికులు తప్పితే ఇక్కడికి ఉద్యోగానికి రావటానికి ఎవరూ ఇష్టపడరు. అంతగా మనకు ట్రాన్సఫరు కావాలంటే చాలా డబ్బు ఖర్చుపెట్టాలి. అంత డబ్బు మనం కలలో కూడ చూడము అన్నాడు విచారంగా రిటైర్మెంటు ఇక్కడే అప్పటికి మనం ఇక్కడి వాతావరణంనకు అలవాటుపడతాము అన్నాడు సామ్యేలు.

దేవునితో జీవించే వారికి తప్ప మానవ జీవితం ఎటు వంటి వారికైన ప్రయాసపడి భారం మోయటమే అవుతుంది. మనం నమ్మదగని వారమైనా దేవుడు నమ్మ దగినవాడు. మనం ఆయనను మర్చిపోయినా ఆయన మనలను మర్చిపోడు. మాన వుడు మరొక మానవునికి ఎన్ని సార్లైనా ఎన్ని సంవత్సరాలైనా సహాయపడుతూ ఒక్కసారి కనుక సహాయ పడకపోతే గడచిన తను మేళ్ళన్ని మరచిపోయి నిష్ఠూరాలు ఆడుతారు.

దేవుడైతే మనం దేవునికి ఏ చిన్న సేవచేసినా దానికి సంబంధించిన మేలు మనకు ఎప్పుడు అందిస్తుంటాడు. అదీ దేవుని ప్రేమ. సామ్యేలు మంచివాడని కాదు చెడ్డవాడని కాదుగాని సామ్యేలును చూసి కోపపడకుండా సామ్యేలు కేవలం మంటి వాడు అనుకొని జాలిపడతాడు దేవుడు.

1983 ఆగస్టు నెల తొలిరోజులు బేస్తవారిపేట సమితి ఆఫీసులో డ్రైవరుగా పనిచేస్తున్న కృష్ణ గిద్దలూరు 'జీపులో' వెళ్తు ఏక్సిడెంటులో చనిపోయాడు. అతనికి గిద్దలూరు ఆస్పత్రిలో శవపరీక్షలు జరిగాయి. అక్కడ నుండి ఆయన దేహం బేస్తవారి పేట తీసికొని రావటానికి అద్దెకారు కాని ఆటో కాని ఆరోజుల్లో ఏమి లభ్యంకావు.

గవర్నమెంటు డ్రైవరు అయినా అతని శవమును ఇంటికి తేవాలంటే ఎవరో ఒక మెడికల్ ఆఫీసర్ 'లాగ్‌బుక్' లో వ్రాయాలి. కాని ఎవరూ అలా వ్రాయటానికి చట్టం ఒప్పుకోదు ఏమి చెయ్యాలి? సామ్యేలు ఆలోచించాడు తనే బయలుదేరి తన ఇంటివద్ద ఉన్న జీపు తీసుకొని గిద్దలూరు హాస్పటల్ నుండి 'కృష్ణదేహాన్ని' అతని భార్యకి అప్పగించాడు అతనికి అయిదుగురు చిన్న ఆడపిల్లల సంతానం.

యన్.జీ.వో ల సమ్మె కొనసాగుతున్నది.ఆగస్టు 23న జిల్లా మెడికల్ అంటే హెల్త్ ఆఫీసర్‌గారు మరి ఇద్దరుడాక్టర్లు సర్వీస్ ఇంజనీరు, గవర్నమెంటు డ్రైవర్లు అందరూ సమ్మెలో ఉన్నందున వారే 'డ్రైవ్' చేసికొంటూ కంభం జి.యల్.సి. యూనిట్ ఆఫీసుకు వచ్చారు. సమ్మెలో పాల్గోనని డ్రైవర్ సామ్యేల్, అటెండర్ రామయ్య ఆఫీసులో ఉన్నారు.

సర్వీసు ఇంజనీరు సామ్యేలును పిలచి 'జీపు'ఎక్కడ అని అడిగాడు మా ఇంటి వద్ద ఉన్నది అన్నాడు సామ్యేలు.మీ యింటి వద్ద ఎందుకు పెట్టావు అన్నాడు ఇంజనీరు.

ఈ ఆఫీసుకి ప్రహరీలేదు నైట్ వాచ్‌మెన్ లేదు మా ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్ ఈ ఊరిలో ఉండరు అన్నాడు సామ్యేలు. చూద్దాం పద  అన్నాడు ఇంజనీరు. ఇంటికి ఆఫీసుకి 100 గజాలు మాత్రమే దూరం ఇద్దరూ కొంతదూరం నడచిన తర్వాత సామ్యేలు నిలిచాడు ఇంజనీరు ఆగాడు.

సార్ మా యింటి వద్ద జీపును చూడండి. మీరు ఏదయినా మాట్లాడలంటే ఆఫీసుకి వచ్చిన తర్వాత మాట్లాడండి అన్నాడు. సామ్యేలు గ్రాడ్యుయేట్ కాబట్టి ఇంజనీరు సామ్యేలుతో ఇంగ్లీషులోనే మాట్లాడతాడు. ఎందుకు అన్నాడు ఇంజనీరు. మా యింటి వద్ద నా పిల్లలు భార్య ఉన్నారు. మీరు వారి ముందు నాతో కోపంగా మాట్లాడితే వాళ్ళు బాధ పడతారు అన్నాడు సామ్యేలు (ఇంజనీరుకి బి.పి. ఎక్కువ)

సరే అన్నాడు ఇంజనీరు. ఇంటి ముందు నిలచి ఉన్న జీపును చుట్టూ తిరిగి చూచాడు బానెట్ పైకి ఎత్తమన్నాడు. సామ్యేలు అలా చేసాడు. బ్యాటరీ టర్మినల్ తీయలేదే? అన్నాడు. బ్యాటరీ డెడ్ అండీ అన్నాడు సామ్యేలు. సరే పద అని వెను దిరిగాడు. నీవు శవాలను బండిలో తెస్తున్నావంటగా అన్నాడు. నా తోటి డ్రైవరు చనిపోతే మార్చురీ నుండి వాళ్ళ ఇంటికి తీసికొని వెళ్ళాను అన్నాడు సామ్యేలు.

అది చట్టవిరుద్ధమని తెలియదా? అన్నాడు. ఈ ఉద్యోగంలో చేరినప్పట్నుండి చట్టవిరుద్ధమైన పనులెన్నో చేసాను. అవన్ని ఒంగోలులో ఆఫీసర్లు చెప్తేనే చేసాను. అప్పుడు మీకు తెలిసికూడ అడగలేదు కదా! అన్నాడు. సామ్యేలు నడుస్తూ. యూ ఆర్ నాట్ టాకింగ్ లైకె ఏ డ్రైవర్ అన్నాడు ఇంజనీరు. అయితే మీకాళ్ళు పట్టుకోమంటారా? అన్నాడు సామ్యేలు తెలుగులో. అనుకోని ఈ సన్నివేశానికి ఇంజనీరు ముఖం ఎర్రబడింది.

నిన్ను ఇక్కడ నుండి ట్రాన్సఫర్ చేస్తాను అన్నాడు ఒంగోలు వదిలిన తర్వాత ఏ ఊరైన ఒకటే అన్నాడు సామ్యేలు నీకు ప్రోబేషన్ లేకుండా రాస్తాను అన్నాడు.

మీ ఇష్టం అన్నాడు సామ్యేలు. ఇద్దరూ కలిసి ఆఫీసులోకి వచ్చారు. జిల్లా ఆఫీసరు ఇద్దరు డాక్టర్లు కుర్చీలలో కూర్చుని ఉన్నారు. ఇంజనీరు ముఖం చూసి వారు గాబరా పడ్డారు.

'రామయ్యా, మీ టైపిస్టును ఒకసారి పిలుచుకొనిరా' అని అటెండరుతో అన్నాడు. 'మా టైపిస్టు 6 నెలలక్రితం ప్రమోషన్‌లో ట్రాన్స్‌ఫర్ అయ్యారు సార్ అప్పటినుండి సామ్యేలు గారే మా టైపిస్టు' అన్నాడు.

డ్రైవరా? టైపిస్టా?అని ఆశ్చర్యపోయారు జిల్లా ఆఫీసర్, ఆ ఇద్దరు డాక్టర్లు.

డ్రైవరు గ్రాడ్యుయేట్ సార్ అన్నాడు రామయ్య అందరూ సామ్యేలువైపు చూసారు. 'ఇప్పుడు టైపిస్టుతో ఏమి పని?' అన్నాడు జిల్లా ఆఫీసర్.

డ్రైవర్ని ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను అన్నాడు ఇంజనీరు. ఆయన ట్రాన్స్‌ఫర్ కాయితాలు ఆయనే ఎలా టైపు చేస్తాడు? మనం ఒంగోలు వెళ్లి పంపిస్తామని వెళ్లిపోయారు అందరూ. సెప్టెంబరు 2వ తారీఖున డ్రైవరు సామ్యేలును కనిగిరి గవర్నమెంటు ఆస్పత్రికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లుగా కనిగిరి డ్రైవర్ వెంకటేశ్వర్లును కంభం జి.యల్.సి. యూనిట్‌కి పంపు తున్నట్లుగా ఆర్డర్లు వచ్చాయి. అక్కడ కనిగిరిలో బండి లేదు, పోస్టుమాత్రం వుంది. అందువల్ల టి.ఏ.లు రావు డ్రైవరు ఆదాయం తగ్గుతుందనే ఉద్దేశ్యంలో ఆ ఇంజనీరు సామ్యేలును కనిగిరికి ట్రాన్స్‌ఫర్ చేశారు.  కనిగిరిలో పెద్ద డాక్టరుగారు డ్రైవర్ని ప్యూన్‌గా వాకిట్లో నిలబెడతాడు. పాపం సామ్యేలు అంతేకాక సామ్యేలు దగ్గర వచ్చే మందు వాసన అక్కడ డాక్టర్లు ఎవరికీ పడదు. ఇకమీదట సామ్యేలుకు అంతా కష్టకాలమే. ఇవన్నీ సామ్యేలు మీద ఏమి పనిచేయలేదు. నిండా మునిగిన వాడికి చలేంటి? ఇంతకంటే పెద్ద అవమానాలే భరించాడు.

మరుసటి రోజే కనిగిరి వచ్చాడు. అక్కడ ఒక టీ కొట్లో మంచినీళ్లు అడిగి త్రాగాడు. అవి ఉప్పగా వున్నవి. ఏంటి ఉప్పగా ఉన్నాయి అని అడిగితే, ఇక్కడి నీళ్లు ఇంతే అన్నాడు ఆ టీకొట్టు వాడు. ఆస్పత్రి దగ్గర్లోనే ఇల్లు దొరికింది. అడ్వాన్సు కట్టి తాళం వేశాడు. తన అవసరాలకి హుస్సేనయ్య డాక్టరుగారు సహాయపడ్డాడు. కంభం నుండి కుటుంబాన్ని కనిగిరికి తీసుకొచ్చాడు. (సశేషం)

క్విజ్ **38**

# జనవరి నెల ప్రశ్న ?

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

1. **ఇది మొదలుకొని నీకు యుద్ధములే కలుగును ఈ మాట ఏ ప్రవక్త ఏ రాజుతో చెప్పెను?**

2. **శిశువైన యేసును దేవాలయమునకు తీసుకొని వెళ్లినప్పుడు ఆయన వయస్సెంత?**

**డిసెంబరు నెల ప్రశ్నకు జవాబులు కరెక్టుగా వ్రాసి పంపిన వారు :**
**బత్తుల ఆనీ మేరి, హైదరాబాదు**
**బి.ఎ. లాజరస్, నిడదవోలు**
**యం. రాజకుమారి, ఒంగోలు**

ప్రభువునందు మీకు నా వందనములు,
క్రీస్తునందు ప్రియమైన పాస్టరుగార్కి, దేవదాసు చేయు వందనములు. ముఖ్యముగా వ్రాయుట ఏమనగా , ప్రతి నెల వచ్చే మీ పుస్తకం చదివి ఆనందించాను. దేవుని కృపను బట్టి ఇప్పుడే కొద్దిగా విశ్రాంతిగా ఉన్నాను. మరి ముఖ్యంగా వ్రాయుట ఏమనగా నేను 2001సంవత్సరములో ఉద్యోగంలో చేరాను. చేరినప్పటినుండి నాకు ఎలాంటి సంతోషం, ఆనందం, సంతృప్తి, పరిపూర్ణతగాని నా జీవితంలో కలుగలేదు. అనేక ఇబ్బందులు కష్టాలు సమస్యలతోనే వెళ్లుతున్నది. ఈ రీతిగా ఎందుకు జరుగుతుంది? నా పాపాలు లేక నా అవిశ్వాసం వలన జరుగుతుందో తెలియక పెద్ద సమస్యగా ఉండినది. ఒక వారం క్రితం ఈ సమస్యల వలన నా జీవితం పై ఎంతగానో ఒత్తిడి కలిగి వైరాగ్యంతో జీవితం అంతం చేసుకునే వరకు మనో వేధన కలిగింది. దయచేసి మీ ప్రతి మాసపత్రికలను పంపించి, నేను దేవునిలో ఓ మంచి విశ్వాసిగా జీవించి ఆయనకు మహిమ కలుగునట్లుగా, శాంతి సమాధానముల కొరకు మీ ప్రార్ధనలో నన్ను జ్ఞాపకము చేసుకోండి.

**దేవదాసు, బెంగుళూరు**

ప్రభువునందు ప్రియమైన ఎడిటర్‌గారికి,

నా వందనములు. మీ ఆధ్యాత్మిక మాసపత్రిక 'కిరణం' షాప్ తో ఉన్నది. నేను కిరణం షాప్ అతన్ని అడిగాను న్యూస్ పేపర్లతో వచ్చింది అన్నాడు. నేను తీసుకొని చదివాను. సాక్ష్యాలు, భక్తసింగ్ గారి కథ, మైఖేల్ విజయకుమార్ గారి సాక్ష్యం, విశ్వాసంలో ఓ మెట్టు, ఎ.ఎన్.ఆర్.జక్కం, శ్రీమతి సందింటి కమలమ్మ, యజ్ఞము, ఎస్.ఎన్.రావ్, పరవస్తు గార్లవి చాలా బాగున్నవి. మరియు అవి చదివి నా హృదయమునకు చాలా నెమ్మదిగా ఉన్నది. హన్నాకృప పత్రికను దేవుడు విస్తారముగా ఆశీర్వదించునుగాక! పత్రికను వెంటనే పంపగలరు.

**కె.వై.దేవదానంబాబు, నంద్యాల**

దైవజనులైన కొడవటికంటి గార్కి వందనములు,

అయ్యా, మీ హన్నాకృప పత్రిక చదువుటకు ఎంతో ఆధ్యాత్మికముగా ఉన్నది. మీ శీర్షికలు క్రైస్తవులు తెలుసు కోవలసిన హక్కులు, కనువిప్పు, యేసుకధ అనే శీర్షికలు చదువుటకు ఎంతో మధురముగా మరియు హృదయమునకు హత్తుకొనే విధముగా ఉన్నవి. మీ అమూల్యమైన పత్రికను నాకు పంపించగలరని కోరుచున్నాను. అలాగే మా కుటుంబమును గురించి ప్రార్ధన చేయగలరని ప్రభువు నామమున ప్రార్ధించుచున్నాను.

**గాదె ఇన్నారెడ్డి, తూబాడు, (గుంటూరు జిల్లా)**

**ఎస్.యం.ఎస్. (S.M.S.) .పరిచర్య**

**ఎవరికైనా ప్రతిరోజు దేవుని వాక్యము ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో 9908822365 నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభి లాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు ప్రియులు ఎ.యన్.ఆర్.జక్కం గారు ప్రతినెల రూ.500/- అందించుచున్నారు. వారికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.

# గొల్లపల్లి నతానియేలు

తూర్పు డెల్టా ప్రాంతమంతటిలో గొల్లపల్లి నతానియేలు గారి సేవా పరిచర్య భారము మన తెలుగు వారి మధ్యను జరిగినది. బౌడెన్‌గారి మనుమడు ఫ్రాన్సిస్‌గారి ద్వారా ఆయన దేవుని సువార్తను విని ప్రభువును రక్షకుడుగా అంగీకరించినాడు.

బౌడెన్‌తో పాలకొల్లులో రెండు సంవత్సరాలు నివసించిన పిదప తిరిగి తన స్వగ్రామమునకు వచ్చినాడు. అక్కడ ఆయనకు మద్రాసు కంపెనీ వారిచేత చెరకు పంటను భూమిలో నాటేందుకుగాను ముఠాకూలీలను సరఫరా చేసే మంచి ఉద్యోగం దొరికినది. ఈ పని వలన ఆయన అనేకమందికి పరిచయస్తుడైనాడు. అంతేకాకుండా మంచి పరపతిని ప్రజల మధ్య సంపాదించుకున్నాడు. ఇలాంటి అనుకూల పరిస్థితులను తాను ఉపయోగించుకొని తనను కలిసే వారందరితోను ప్రభువైన యేసుక్రీస్తు శిలువలో జరిగించిన ఆ గొప్ప రక్షణ మార్గమును వారికి తెలిపి, సువార్తను అంగీకరించులాగున చేయగలిగినాడు. ఆలాగున తన పని వారిలో అనేకమంది చేత యేసుప్రభువును రక్షకుడుగా అంగీకరింపచేసి రక్షణలోకి నడిపించినాడు.

వారిలో చాలా తెలివైనవాడు మరియు చురుకైన ఒక అగ్రకులస్తుడు కలడు. అతనిపేరు అప్పయ్య. ఆనాటి కాల పరిస్థితులనుబట్టి చదువుకోవడానికి అవకాశములు లేని అనేకమైన ఇతరులులాగా తను కూడ చదువుకొనలేక పోయెను. కాని హిందూమతానికి సంబంధించిన పాటలు పాడడంలో చాలా సమర్ధత చూపించెడి వాడు. ఈ విధంగా తన పన్నెండవ సంవత్సరానికే మంచి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించగలిగెను. ఫ్రాన్సిస్‌గారు ఇతనిలో భక్తిశ్రద్ధలు కలిగి రాముడిని దేవుడుగా కొలవడం గమనించినాడు.

ఒక దినమున అప్పయ్య ఫ్రాన్సిస్‌గారి దగ్గరకు వచ్చి తన ఏకైక కుమారుని భూస్థాపన కార్యక్రమమునకు ఏర్పాట్లు జరిగించుట చూచి ఈ విధంగా ప్రశ్నించినాడు. నీవు ఎందుకు నీ కుమారుని కట్టెలతో కాల్చివేయకుండా మృతదేహాన్ని ఎందుకు భూస్థాపన చేయు చున్నావని ప్రశ్నించెను. అందుకు ఫ్రాన్సిస్‌గారు పాపక్షమాపణ, రక్షణ, మృతుల పునరుత్థానమును గురించి బాగుగా వివరించెను. భూస్థాపన కార్యక్రమాన్ని అవకాశముగా చేసుకొని యేసుక్రీస్తు సువార్తను చక్కగా బోధించాడు. యేసుక్రీస్తు రక్తములో పాపక్షమాపణ, విశ్వాసము ద్వారా రక్షణ, బాప్తిస్మము ద్వారా బహిరంగ సాక్ష్యము ఇవన్నీ విశదముగా వివరించి అతనిని ఒప్పింపజేసిన తరువాత ఇపుడు నీవు పాలకొల్లు వెళ్లి బౌడెన్ దగ్గర ఇంకా ఎక్కువగా యేసు ప్రభువును గురించి తెలుసుకొనుమని చెప్పెను.

అప్పయ్య 45 మైళ్లు నడచి పాలకొల్లు వెళ్లి బౌడెన్‌ను కలుసుకుందామని వెళ్ళాడు. కాని బౌడెన్‌గారు బెంగుళూరు వెళ్ళాడని తెలుసికొని నిరాశపడ్డాడు. అక్కడ నుండి నరసాపూర్ వెళ్లి బౌడెన్‌గారిని కలుసుకున్నప్పుడు ఆయన చాలా సంతోషించి ఈ విధంగా చెప్పాడు. మారుమూల ప్రాంతంలో కూడ దేవుడు తన వాక్యాన్ని ఫలింపజేసినందుకు దేవుని స్తుతించాడు. అప్పయ్య మారుమనస్సు పొందిన తరువాత తన రక్షకునియందు ఆనందించుచు తిరిగి వెళ్ళాడు. ఇలాంటి సంతోషకరమైన సమయంలో ఆయన ప్రతి ఆదివారం దేవుని ఆరాధనలో పాల్గొనడానికి 20 మైళ్లు కాలినడకన రాజమండ్రి వచ్చి ఆరాధించేవాడు. ఆయనకు బాప్తిస్మమిచ్చిన గ్రొన్నింగ్ గారు ఆయనకు వ్రాయడము, చదవడము నేర్పించి వాక్య పఠనము, వాక్యమును బోధించుట, ప్రార్థించుట నేర్పించి తన స్వంత జనాంగము మధ్య ప్రభువు సేవచేయునట్లుగా తర్ఫీతునిచ్చెను. ఆయనే గొల్లపల్లి నతనయేలు.

నతానియేలు తిరిగి తన స్వగ్రామమునకు వచ్చినప్పుడు తన తండ్రియే తన యొక్క బోధలు వినకుండ తనను ఇంటి నుండి బయటకు గెంటి వేసినాడు. ఇంటిలో ప్రతిద్వారము మూయబడడము గమనించి తన అక్కయైన అచ్చమ్మ దగ్గరు కాలేరు గ్రామము వెళ్లి అక్కడ నివసించు చుండెను. వారి అక్కగారింట్లో ఉంటుండగా రెండవరోజున రాత్రియందు ఆయనకు ఒక దర్శనము కలిగినది. ఆ దర్శనములో ఆయనకు కలగబోవు బాధలు, హింసలు దేవుడు

తనకు చూపించినాడు. అప్పుడు ఆయన దేవునిని స్తుతించుచు ఒక కీర్తన వ్రాసినాడు. "Daily Art thou our refuge, O our God". ఇది కొద్ది దినములలోనే రుజువు పరచబడినది. ఎట్లనగా –తన సువార్త పరిచర్యకు వ్యతిరేకంగా రెచ్చిపోయిన ఆ గ్రామ ప్రజలు తనను అనేక రీతుల ఇబ్బంది కలుగజేసి సువార్త పరిచర్యకు ఆటంకమైరి. కాని అచ్చమ్మ మాత్రము ఆయన వెంట వుండినది. ఆయన మీద ఆ గ్రామ ప్రజలు ఒక కట్టు కథను అల్లి ఆయన మీద లేనిపోని అభాండములు వేసి ఆయనను నిర్బంధించిరి. తరువాత రెండు చేతులకు రెండు సంకెళ్లు వేసి మేజిస్ట్రేటు ముందుకు తీసికొని వెళ్ళినారు.

ఆ గ్రామ ప్రజల ముందుగాని, మేజిస్ట్రేటు ముందుగాని ఆయనను నిలువబెట్టినప్పుడు దేవుని కీర్తనలు పాడుచూ స్తుతించెను. ఆయన ఇట్టి అవమానములు బాధలు అనుభవించుచున్నప్పుడు ఆయన హృదయాంత రాళములో నుండి వచ్చినవే ఆయన రచించిన కీర్తనలు. నతానియేలుగారి పరిచర్యకు ఫలితంగా దేవుడు ఆత్మల పంటను అనుగ్రహించెను. వారిలో చెప్పుకొనదగిన ఆత్మ ఏదనగా మాదిగ కులస్థుడైన మోషే. ఆయన సంపాదించిన ఆత్మలను కాపు కాయు దొడ్డి అనగా ఆలయము కొరకు స్థలము ఎవరును అమ్మ చూపడము లేదు. అయితే ఒక అద్భుతము ఏమిటంటే ఆయనను హింసించడంలో ప్రధాన పాత్ర వహించిన వ్యక్తియే తన స్థలమును ఆయనకు అమ్మినాడు. అందులో తన నివాసము కొరకు ఒక ఇల్లు ఏర్పాటు చేసికొని అందులోనే దాదాపుగా ఏడు సంవత్సరాలు తన చిన్నమందను కాయుచూ వచ్చెను. ఆ తరువాత బౌడెన్‌గారు, ముల్లర్ దొరగారి సహాయంతో 80 సెంట్ల స్థలమును కొనిచ్చినాడు.

ముద్రమండలో ఒక క్రొత్తరకమైన సమస్య వచ్చిపడింది. ఫ్రాన్సిస్‌గారు మరియు ఆయన కుమార్తెలు పాలకొల్లులో నివసించేవారు. వారు బాప్తిస్మము కొరకు లూథరన్ సంఘములో చిన్నబిడ్డలపైన నీరు చిలకరించడమును వారు వ్యతిరేకించిరి. అది చాలా వివాదాస్పదమైనది. బాప్తిస్మము యొక్క పద్ధతి అది కాదు అని వాదించిరి. మరి ముఖ్యంగా చిన్నబిడ్డలకు అని వారు వాక్యాధారమును చూపించిరి. హీలీస్ మరియు బీర్ వాక్యాధారము చూపించి అది కాదనిరి. అంతటితో వివాదము సద్దుమణిగెను. నతానియేలుగారి మనస్సు ఒప్పుకొనకపోవడంతో తన చిన్నబిడ్డలను బాల్య బాప్తిస్మము కొరకు తీసికొని రాలేదు. అది తప్పుగా ఎంచిన సంఘ సభ్యులు ఆయనను వెలివేసిరి. ఇదే పరిస్థితిలో అతని స్నేహితుడైన ఫిలిప్పును కూడ వారు వెలివేసిరి.

1866 ఆగష్టు నెలలో ఈ రెండు కుటుంబాల వారు మరలా నీళ్ళలో ముంచడం ద్వారా బాప్తిస్మము తీసికొనిరి. నతానియేలుగారిచేత రక్షింపబడిన వారందరును ముంచడం బాప్తిస్మము తీసికొన్నవారే. తన కార్యములన్నిటిలో ప్రభువు సహాయము చేయుచుండగా అతడు దినదినము బలము పొంది ఇంకా ఎక్కువగా ప్రభువు కొరకు కష్టపడుతూ తనను తాను క్రొవ్వత్తిలాగా కరగించుకొనుచూ సేవచేయుచుండెను.

ఈ గొప్ప పరిచర్యలో ఆయన అనేకమంది జతపని వారిని సంపాదించుకొనగలిగెను. అట్టివారిలో ముఖ్యులెవరనగా, ముద్రమండలోని ఫిలిప్పు, ధవళేశ్వరంలోని థామస్, కాకినాడలోని గబ్రియేలు మొదలగువారు. వీరి పరిచర్యలో అనేకమంది ప్రభువును రక్షకుడిగా అంగీకరించిరి. అట్టివారిలో కఠోర రాహేలు అనే కమ్మ కులస్తురాలు ప్రభువును అంగీకరించి 1868వ సం॥లో బాప్తిస్మము తీసికొనినది. అందువలన ఆమె ఇంటిలో నుండి గెంటివేయబడినది. ఆమెను నరసాపూర్‌నకు తీసికొని వచ్చి హీలిసమ్మ దగ్గర మిగిలిన విశ్వాసులైన స్త్రీలతో జీవించినది.

1870లో హీలిసమ్మ ఈ విధంగా వ్రాసినది. నతానియేలు ఒక నీరు వెదజల్లే ఫౌంటేన్‌లాంటివాడు. మన జీవదాత వెదజల్లే ఫౌంటేన్ నుండి వచ్చే జీవజలనీరు మన హృదయాలను నింపుచుండగా నోరు ఈవిధంగా మాట్లాడుతుంది.

ఈ ప్రియమైన దైవజనుడిని గురించి ఇంకా ఎక్కువగా చెప్పవలసియున్నది. కాని మాటలు సరిపోవడము లేదు. మన పరమ తండ్రి ఆయనను, ఆయన పరిచర్యను ప్రేమించి ఆయన నమ్మకత్వమునుబట్టి 1914 ఏప్రిల్ వరకు భూమి మీద జీవింపచేసినాడు. తన యొక్క తుది శ్వాస వరకు వాడబారని ప్రేమ, విశ్వాసములతో ప్రభువును సేవించి తెలుగుజాతి గర్వించదగిన విధంగా అనేక కీర్తనలు వ్రాసి ఆంధ్ర క్రైస్తవుల మనస్సులో చెరగని ముద్ర వేసినాడు.

# కనువిప్పు

**యూనివర్సిటీ కాలేజిలో క్రొత్తగా చేరిన ఒక విద్యార్థితో ఒక క్రైస్తవ లెక్చరర్ గారి సుదీర్ఘ సంభాషణ**

**లెక్చరర్ :** 3. పాపంచేసి సంపాదించుకున్న నీ ఉద్యోగం ద్వారా నెలవారి జీతం, దాని ద్వారా స్థిరాస్థులు మొదలైనవి సంపాదించు కొంటావు. గనుక, అవన్నీ పాపంచేసి సంపాదించుకున్నవే అవుతాయి

4. ఈలోగా, నీవు ఈలోకం నుండి తనువు చాలించుటయో లేక దేవుని రెండవ రాకడ రావటమో జరుగుతుందనుకో. అందుచేత, దేవుని సమక్షంలో నీ ఆత్మ తీర్పుకు నిలబడినప్పుడు నీపై అంతవరకూ నిలిచియున్న అబద్ధమనే ఆ పాపంవల్ల నీవు దోషివిగా తీర్చబడి అగ్నిగుండంలో త్రోయబడి రెండవ మరణం పొందుతావు.

5. మనుష్యుడు తాను బ్రతికి ఉండగానే తన సమస్త పాపములు క్షమించబడేలా చూచుకోవాలి. ఏ ఒక్క పాపమైనా క్షమించ బడకుండా మిగిలి వున్నట్లయితే ఆ ఒక్కదాని విషయమై కూడా అతడు దోషిగా తీర్పు తీర్చబడి అగ్నిగుండంలోకి త్రోయబడి రెండవ మరణం పొందుతాడు. ఇది ముమ్మాటికి నిజం.

6. యెహెజ్కేలు 33:14-16 ప్రకారం పాపము క్షమించ బడాలంటే ఒకడు తన పాపాన్ని ఒప్పుకొని, దాని విషయమై పశ్చాత్తాపపడి ఆ పాపాన్ని విడిచి, బయటకు వచ్చి, అట్టిపాపం చేసినందుకుగాను క్షమించమని దేవుణ్ణి ప్రార్థించాలి. కాని, చేసిన పాపం నుండి అతడు బయటికి రాలేకుండినా లేదా దాన్ని విరమించుకోలేకుండినా లేదా ఆ పాపం ద్వారా అతనికి సంక్రమించిన స్థిరాస్థుల్ని యింకా అతను కలిగి యుండినా అతడు దేవుణ్ణి ఎంత ప్రార్థించినా ఆ పాపం క్షమించబడదు.

7. నీవు క్రైస్తవుడవైయుండి హిందువుడవని అబద్ధమాడి బాగా చదువుకొని, ఉద్యోగం సంపాదించుకొని దాని ద్వారా సంపాదనపరుడవైయుంటూ మధ్యలో నీ తప్పు తెలుసుకొని (పాపమే చేశానని తెలుసుకొని), సత్వరమే ఆ తప్పును ఒప్పుకొని, దాని విషయమై పశ్చాత్తాపపడి, దాన్ని విడిచి బయటికి రావాలని కోరుకున్నప్పటికి నీవు బయటికి రాలేవు. ఎందుకంటే, ఆ ఉద్యోగం, దానిపై వచ్చే రాబడి, ప్రాపంచిక అవసరాలు, నీ భార్యబిడ్డల ఒత్తిడి, నిన్నంతగా బంధించి వుంచుతాయి. అందువల్ల, నీవెంతగా ప్రార్థించిననూ నీవు చేసిన ఆ పాపం క్షమించబడదు. ఎందుకంటే, నీవింకా ఆ పాపంలోనే నిలిచి యుంటావు గనుక.

8. ఒకవేళ నీవు బ్రతికి బాగుండి ఆ ఉద్యోగాన్ని, దాని ద్వారా సంపాదించుకున్న స్థిరాస్థుల్ని వదులుకొని వాటిని ఏమాత్రం అనుభవించకుండా పాపక్షమాపణ కోసం దేవుణ్ణి కోరినట్లయితే దేవుడు తప్పక నిన్ను క్షమిస్తాడు. నీవు ఆపాపం నుండి పూర్తిగా విముక్తుడవు అవుతావు.

9. కాని, నీవు బ్రతికి బాగుండి పాపం చేసి సంపాదించుకున్న ఆ ఉద్యోగం నుండి రిటైర్ అయిన తర్వాత, దేవా నా పాపము నుండి ఇప్పుడైనా క్షమించుమయ్యా అని ప్రార్థించావనుకో. అయినప్పటికి ఆ పాపం క్షమించబడదు. ఎందుకంటే, పాపం చేయుట ద్వారా సంపాదించుకున్న ఆ ఉద్యోగ రీత్యా నీవు పొందిన స్థిరాస్థులైన ఇల్లు, పొలాలు, స్థలాలు, నగలు, మోటారు వాహనాలు మున్నగు వాటిని యింకా అనుభవిస్తూనే వుంటావు. అంటే, నీవు మొదట చేసిన పాపాన్ని వదలించుకున్నా ఆ పాప శేషాన్ని మాత్రం వదులుకోలేదన్న మాట! కాబట్టి, ప్రకటన 21:8 లో అబద్ధికులను గూర్చి వ్రాయబడిన దేవుని వాక్యం నీ విషయంలో నెరవేరుతుందన్న మాట! కాబట్టి, ప్రభాకరరావ్, నీవు నేడు చేస్తున్న ఈచిన్న "అబద్ధమనే" పాపం నీకు తెలియకుండానే నిన్ను వెంటాడి యెంతగా నాశనం చేస్తుందో గ్రహించావా? సత్యాన్ని తెలుసుకోనివ్వకురా నిన్నూ, నీలాంటి అనేకమంది క్రైస్తవ సోదరసోదరీల మనో నేత్రాలకు సాతాను యీ విధంగా గ్రుడ్డితనము కలుగచేయుచున్నాడని నా అభిప్రాయం. ఏమంటావ్? ప్రభాకరరావ్? మరియు, మన సంఘాల్లో చాలామంది క్రైస్తవులు యస్.సి. (హిందు) అని తెల్పే సర్టిఫికేట్ల ద్వారా రాజకీయాల్లో పదవుల కోసం ప్రయత్నం చేసి గెలుపొందుచున్నారు. బ్యాంకుల్లో లోన్లు తీసుకొని వ్యాపారాలు చేస్తున్నారు. తమ పిల్లలకు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు పొందు చున్నారు. ఇవన్నీ "అబద్ధమాడి" సంపాదించు కొంటున్నవి. వీటివలన వారంతా ప్రభువు యొక్క పరిశుద్ధ నామాన్ని అన్యజనుల ఎదుట ధూషణపాలు చేయుటయేకాక తాము పరలోక ప్రవేశాన్ని శాశ్వతంగా పోగొట్టుకుంటున్నారనుటలో

సందేహ పడనవసరంలేదని నా అభిప్రాయము.

**విద్యార్థి :** సార్, నాకు నిజంగా కనువిప్పు కల్గించారు. ఈరోజే నిజమైన సర్టిఫికేట్‌తో నా అబద్ధపు (దొంగ) సర్టిఫికేట్‌ను రద్దుచేస్తాను.

**లెక్చరర్ :** ఎందుకైనా మంచిది నీ తల్లిదండ్రులతో ఒకసారి సంప్రదించకూడదూ?

**విద్యార్థి :** అవసరం లేదు సార్! నా పాపాలు నావి. నా రక్షణ నాది. దేవుని వాక్యానుసారంగా నాలో కల్గిన ఈ మహత్తరమైన మార్పుకు నన్ను సదా బద్ధుడను కానివ్వండి సార్. మత్తయి 16:24, లో వ్రాయబడిన ప్రకారం నా సిలువనెత్తుకొని యేసును వెంబడిస్తాను. నిజంగా, మత్త 6:26-30 లో ఆకాశ పక్షులను గూర్చి, అడవి పువ్వులను గూర్చి ప్రభుయేసు చెప్పిన ఉపమానం నాకునూ ఈనాటి క్రైస్తవమతస్తు లందరికినీ వర్తిస్తుందని నేను పూర్తిగా విశ్వసిస్తున్నాను. కీర్తనలు 5:6 ప్రకారం అబద్ధమాడు వారిని యెహోవా నాశనము చేయుననీ, రోమా 14:17 లో వ్రాయబడినట్లు దేవుని రాజ్యము భోజనమూ, పానమూ కాదనీ, "నీతి" అని లోకానికి చాటి చెప్తాను సార్.

**లెక్చరర్ :** మంచిది, వెళ్ళిరా! దేవుడు నీ ప్రయత్నాన్ని తప్పక సఫలం చేస్తాడని నమ్ముదాం.

**విద్యార్థి :** అయితే, వెళ్ళేముందు నాదో ధర్మసందేహం సార్! ఈ మధ్య వార్తాపత్రికల్లో క్రైస్తవుల విషయమై విరివిగా ప్రస్తావన జరుగుచున్నందువల్ల మిమ్మల్ని అడగాలని ఆశిస్తున్నాను. అదేమంటే, మీ వలే మతమార్పిడి చేసుకొని బి.సి. (సి) సర్టిఫికేట్‌ను కలిగియున్నందువల్ల ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యా, ఉద్యోగ, ఆరోగ్య, సామాజిక పరమైన సౌకర్యాలన్నీ పోగొట్టుకున్న క్రైస్తవ సోదర, సోదరీలకు మతమార్పిడికి పూర్వం వారను భవిస్తుండిన సౌకర్యాలన్నిటినీ తిరిగి పునరుద్దరించటానికై పార్లమెంటులో ఏదో బిల్లు ప్రవేశపెడుతున్నారటగా?

**లెక్చరర్ :** ఓ! ఆ విషయమా! చూడు ప్రభాకర్రావ్, తన బిడ్డలు నష్టపోవుటను దేవుడు ఎన్నడూ సహించలేదు. ఎందుకంటే, వారందరూ ఆయన యందు విశ్వాసముంచుట ద్వారా సాతాను రాజ్య పౌరసత్వాన్ని కాళ్ళదన్ని దేవుని రాజ్య పౌరసత్వాన్ని చేపట్టి ఆయనను ఘనపరిచారు. అందువల్ల, అప్పటినుండి వారి బాగోగులన్నీ దేవుని యొక్క బాధ్యతయై యున్నాయి. కాబట్టి, "నీకు విరోధముగా రూపింపబడిన యే ఆయుధమును వర్ధిల్లదు. న్యాయవిమర్శలో నీకు దోషారోపణ చేయు ప్రతి వానికి నీవు నేర స్థాపన చేసెదవు." అని యెషయా 54:17 లో చెప్పబడిన దేవుని వాక్యానుసారం దేవుడే వారి తరుపున ప్రభుత్వంతో వ్యాజ్యమాడి వారు అన్యాయంగా కోల్పోయిన ప్రభుత్వ ఉచిత సౌకర్యాలన్నిటి విషయంలో ఏసుక్రీస్తు వారి ద్వారా వారికి న్యాయం జరిగిస్తాడు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టబోవుచున్న వైనాన్ని గమనిస్తే ఇది నిజంగా 'దేవుడు కలుగజేసుకున్న కార్యక్రమమే అనిపిస్తుంది. దేవునికి స్తోత్రం! ఇది సఫలమవ్వాలని మనందరం మన సంఘస్తులతో ఏకీభవించి విజ్ఞాపనా ప్రార్థనలర్పించి మత్తయి సువార్త 18:19 ప్రకారం ఘనవిజయాన్ని పొందుదాం.

అయితే, మత్తయి 5:6 ప్రకారం క్రైస్తవులెప్పుడూ నిజాయితీ పరులైయుండాలి. గనుక తాము అన్యాయంగా పోగొట్టుకున్న ప్రభుత్వ ఉచిత సౌకర్యాలన్నీ మరల తమకు పునరుద్దరించబడినా పునరుద్దిరించబడక పోయినా తాము ప్రస్తుతం కల్గియుంటున్న అబద్ధపు (దొంగ) సర్టిఫికేట్లను తప్పకుండా రద్దు చేయించుకొని సత్యమైన సర్టిఫికేట్లను మాత్రమే కల్గియుండుట "దేవుని నీతి" అని నేను నమ్ము చున్నాను. గనుక, నీ అబద్ధపు సర్టిఫికేట్‌ను మార్పించు కోబోయే ప్రయత్నాన్ని మాత్రం మానుకోవద్దు సుమా!

ఈ సందర్భంలో నీవు గమనించవలసిన మరో విషయం ఏమంటే ఒకవేళ నిజంగానే పార్లమెంటులో ఆ బిల్లు విజయవంతంగా ఆమోదించబడి "మత మార్పిడి చేసుకొని క్రైస్తవులుగా మారిన వారందరికీ ప్రభుత్వ సౌకర్యాలన్నిటినీ "పునరుద్దరిస్తున్నాం" అని ప్రభుత్వాజ్ఞలు జారీ చేయబడగానే మన సంఘాలలో గొప్ప కదలిక వస్తుంది! ''మేము క్రైస్తవులంకామండీ ! అన్యులమేనండీ! అని చెప్పూచూ ఇన్నాళ్ళూ రహస్యంగా ప్రభుత్వాన్ని మోసగిస్తూ అబద్ధపు(దొంగ) సర్టిఫికేట్లను కల్గియుంటున్న క్రైస్తవ సోదరసోదరీలు రవ్వంత ఆలస్యమైనా చేయకుండా పరుగెత్తుకెళ్ళి "మేము క్రైస్తవులమేనండీ! నిజానికి పుట్టు క్రైస్తవులమండీ! ఏదో అశ్రద్ధవల్ల ఇన్నాళ్ళూ సర్టిఫికేట్లలో మాత్రమే అన్యులుగా (హైందవులుగా/క్రైస్తవేతరులుగా) చెలామణి అవుతున్నామండీ!" అని ఏవేవో సాకులు చెప్పి వారి అబద్ధపు (దొంగ) సర్టిఫికేట్లను వెంటనే రద్దు చేయించుకొని సత్యమైన సర్టిఫికేట్లను పొందుతారు! ఎందుకంటే, "మేము క్రైస్తవులం" అని ఇప్పుడు వారు బాహాటంగా చెప్పినా వారికేమాత్రం ప్రమాదం వాటిల్లదుగా! ప్రభుత్వం ఇచ్చే ఉచిత సౌకర్యాలు పోవుగా! ఈలాంటి వారినే "సమయానుకూల క్రైస్తవులు" అనవచ్చు.

సాక్ష్యము

# యస్.ఏ.టి.ఆర్. ప్రసాద్

నా పేరు సారెకొక్కు ఆల్‌ఫ్రెడ్ త్యాగరాజ రాజేంద్రప్రసాద్. సరిగ్గా మధ్యరాత్రి నేను నిద్రలో కాళ్ళతో దుప్పటిని తన్నుతూ ఏయ్ పో...ఛీ పో...ఏయ్ పో అంటూ ఒక మాదిరి భయంతో కూడిన స్వరంతో వణకుచున్నట్లు గట్టిగా అరుస్తూ కాళ్ళతో దుప్పటిని తన్నుచున్నానట. దాదాపు రెండు, మూడు నిమిషాలు అలా చేస్తూనే ఉన్నానట. అప్పుడు నా భార్య ఆ స్వరము విని నన్ను గట్టిగా తట్టి లేపింది. నేను నిద్ర మేల్కొన్నాను. అప్పుడు నా పరిస్థితి ఏమిటంటే ముఖం చెమటతో ఉంది. నేను నిద్ర మేల్కొన్నాను. అంటే భయంతో కూడిన మెలకువ. నా భార్య ఏమిటని అడిగినది. ఆ... ఏదో కల వచ్చిందిలే అని సర్దిచెప్పాను. కనుక తాను మరల వెంటనే నిద్రపోయింది. నేను కొంచెం బెరుకుగా అంటే ఇదివరకటిలాగ ధైర్యంగా బాత్‌రూమ్ లోకి పోలేకపోయాను. అయినను అవసరతనుబట్టి లేచి బాత్‌రూమ్‌కు వెళ్ళివచ్చాను. మరలా పండుకొనగా జరిగినది మరలా నాకళ్ళముందు తిరుగుతున్నది. నిద్ర పట్టడంలేదు. వెంటనే లేచి లైటు వేసి, పెన్ తీసికొని నా డైరిలో ఆ విషయాన్ని రికార్డు చేయడం మొదలుపెట్టాను.

ఇది వ్రాయడానికి ముందు నేను వెంటనే వెళ్ళి టేబుల్ మీద ఉన్న బైబిల్‌ను తీసి తెరచి చదివాను. దేవుడు నాకు చూపించిన వచనములు.

కీర్త 119:174-176

174-యెహోవా, నీ రక్షణకొరకు నేను మిగుల ఆశపడుచున్నాను
నీ ధర్మశాస్త్రము నాకు సంతోషము.

175-నీవు నన్ను బ్రతికింపుము నేను నిన్ను స్తుతించెదను
నీ న్యాయవిధులు నాకు సహాయములగును గాక.

176-తప్పిపోయిన గొఱ్ఱవలె నేను త్రోవ విడిచి తిరిగితిని
నీ సేవకుని వెదకి పట్టుకొనుము ఎందుకనగా
నేను నీ ఆజ్ఞలను మరచువాడను కాను.

**<u>నా కలలో జరిగినది:</u>**

అది ఒక పెద్దకొండ అది కోడిగుడ్డు ఆకారంలో ఒక గుండ్రని నునుపైన బండవలె నున్నది. దాని మధ్యలో నేను ఎడమ ప్రక్కకు తిరిగి కాలుమీద కాలువేసుకొని పండుకొని యున్నాను.అపుడు ఆ కోతిలాంటి జంతువు పాకుకుంటూ నా దగ్గరకు వచ్చి నాకాళ్ళు పట్టుకుంటుంది. నేను విదిలించుకుంటూ ఛాయ్, ఛాయ్ అని అరుస్తూ విదిలించుకుంటున్నాను. నన్ను కాళ్ళు పట్టుకొని లాగుచున్న జంతువు కోతిలాగ ఎగురుచున్నది. కాని కుక్కలాగ ముందు రెండు కాళ్ళతో నన్ను కాళ్ళదగ్గర పట్టుకొని నోటితో నన్ను కొరకడానికి ప్రయత్నం చేస్తుంది. నేను భయంతో అరుస్తూ కాళ్ళు విదిలించి తన్నుచున్నప్పుడు అది నన్ను కరవలేక పోయింది. కాని నన్ను వదలకుండ కాళ్ళ దగ్గర పట్టుకో వడానికి ప్రయత్నం చేస్తుంది.తన ప్రయత్నం మానకుండా నన్ను చిక్కించుకోవాలని మరలా మరలా అలాగే చేస్తుంది. నేనైతే భయముతోనే దాని చేతిలో దొరకకూడదనే ఉద్దేశ్యంతో కాళ్ళతో దానిని తన్నుతూ, నోటితో బెదిరిస్తూ అరుస్తూ నోటి మాటలతో భయపెడుతున్నాను. అలాగా కొన్ని పర్యాయాలు దాని దాడిని ఎదిరిస్తూ, అరుస్తూ చేయగా అది చివరకు నన్ను విడిచివెళ్ళినది.

బుధవారం 9-1-2002 తెల్లవారితే 10-1-2002 గురువారం సమయం రాత్రి12:35నిలకు వచ్చిన ఈకలను నేను డైరిలో రికార్డు చేసినాను. తెల్లవారితే మర్చిపోతా నేమోనని.

ఆదివారం 21-1-2002 తెల్లవారితే 22-1-2002 సోమవారం సమయం రాత్రి 12:00 గంటలకు అదే కల అదే విధముగా రిపీట్ అయినది. నేను రెండు సందర్భాలను కూడా వెంటనే డైరిలో రికార్డు చేసాను. ఇది కలయో లేక దర్శనమో తెలియదుగాని నాకు చాలా మేలు కలిగినది. కాని రెండవ కల ఇంకా లోతైన అర్థాన్ని ఇచ్చే విధంగా ఉంది. దేవుని ఆలోచన, దేవుని తలంపులు, దేవుని మాటలు మాత్రమే ఎక్కడా మార్పు కనిపించదు. అవి శాశ్వతమైనవి. కనుక ఇది దేవుని యొక్క ఆలోచన అనగా పరిశుద్ధాత్ముని ఆలోచన అని నేను ఎరిగి యున్నాను. కనుక దీనిని గురించి నేను అనేక విధములుగా ఆలోచించి, ప్రార్థించితిని. హృదయంలో తీవ్రతగల వానినై ఈ విషయములు పాఠకులకు హన్నాకృప ద్వారా తెలియపరచ ఉద్దేశించితిని. దేవుడు ఈ ఉద్దేశమును ఘనపరచి చదువరులకు ఆత్మీయ ఉజ్జీవము కలుగజేయు నట్లుగా ప్రార్థించుచున్నాను. ...మిగతా 23వ పేజీలో

# ప్రయాణంలో మజిలి

నరసరావుపేటలోని నా స్నేహితుడు చేబ్రోలు సాల్మన్ రాజుగారి తండ్రి యోసేపుగారు మంగళగిరి హాస్పటల్‌లో అడ్మిట్ అయి ఉన్నందున వారిని చూచుటకు 1ఉదయం 5గంటల ప్యాసింజర్‌లో బయలు దేరాను. తెనాలి వరకు రైలులో వెళ్ళి అక్కడ నుండి మంగళగిరి బస్‌లో వెళ్ళాలని తెనాలి వరకు టిక్కెట్టు తీసుకొన్నాను. అయితే తెనాలి దాటి పెదవడ్లపూడి వరకు ఇదే బండిలో వెళ్తే మంగళగిరి వెళ్ళటం సులభమని తెలిసింది. నా ఎదురుగా కూర్చుని ఉన్న వ్యక్తితో ఈ విషయములు మాట్లాడు కొంటుంటే పై బెర్తుమీద పండుకొనియున్న యవ్వనస్తుడు ఆలకిస్తున్నట్లుగా నాకు తెలియదు.

తెనాలి స్టేషనులో బండి ఆగగానే పైనున్న యవ్వనస్తుడు వెంటనే క్రిందికి దిగి పదిరూపాయలు ఇవ్వండి అని తొందర తొందరగా అడిగాడు. నేను ఇచ్చాను అతను బయటికి వెళ్తుంటే అతని స్నేహితుడు అతని వారించాడు. అవతల లైనులో గూడ్సు బండి ఉన్నది నువ్వు బండి బయలుదేరే సమయానికి తిరిగి రాలేవన్నాడు అయినా అతను వెళ్ళి బండి బయలుదేరినప్పుడు లోనికి వచ్చి పెదవడ్లపూడి టిక్కెటు మిగిలిన ఒక రూపాయి నాచేతిలో పెట్టాడు. కృతజ్ఞతతో అతని చూసాను. అతని ఋణం ఎలా తీర్చుకోగలను? అని ఆలోచించి నేను వ్రాసిన నవల పెట్టెలో నుండి బయటకు తీసి అతని పేరు అడిగి 'పాండురంగ రావుకు రచయిత బహుమానం' అని వ్రాసి సంతకం పెట్టి 'గోత్రకర్త, హన్నాకృప, ఖుద్దూస్ అను పుస్తకములను ఇచ్చాను.

పదినిమిషాలయిన తర్వాత 'పాండురంగ' నా వద్దకు వచ్చి ప్రక్కన కూర్చుని 'సార్ మీరు పాష్టరుగారా?' అన్నాడు. 'కాదు సువార్తికుడను' అన్నాను. అప్పుడు పాండురంగ ఇలా అన్నాడు. నేను వేటపాలెం దగ్గర హస్తినాపురంలో మా తల్లిదండ్రులతో ఉండి రోజు ఈ బండిలో విజయవాడ వెళ్ళి ఆటోనగర్‌లో స్టీల్ కంపెనీలో పనిచేస్తున్నాను. నాకు పది సంవత్సరాల వయస్సులో యేసుప్రభువును గురించి నాకు తెలుసు. నాకు ఇప్పుడు 25 సంవత్సరాలు యేసును గురించి మర్చిపోయాను.ఇప్పుడు నేను ఎన్నో మానసిక సంక్షోభములలో ఇబ్బందులలో ఉన్నాను. అయితే యేసుప్రభువు ద్వారా శాంతి సమాధానాలు కలుగుతా యన్న సంగతి మరచిపోయాను. ఇప్పుడు మీరిచ్చిన పుస్తకాల ద్వారా యేసుప్రభువు మరల జ్ఞప్తికి వచ్చాడు అన్నాడు.

అప్పుడు నేను 'చూడు పాండురంగా, ఈ ఉదయం 5:30 గంటలకు ఈ బండి నాకు అందదన్న నమ్మకంతో, మరేదైనా బండి దొరుకుతుందనే నమ్మకంతో స్టేషనుకి వస్తే ఈ బండి బయలు దేరుతుంది. టిక్కెట్టు ఇవ్వమంటే ఇవ్వనన్నాడు అయితే నేను పట్టు పట్టినందున ఇచ్చాడు. నేను రెండవ ఫ్లాట్‌ఫారం వచ్చి కొంచెం స్పీడుగా పోతున్న బండి చివరి కోచ్‌లో ఎక్కాను. అది లేడిస్ కంపార్ట్‌మెంట్. అక్కడ ఉండకూడదని కరవదిలో దిగి ముందుకు పరుగెత్తి నాలుగు బోగీలు దాటి దీంట్లో ఎక్కాను. ఇది ఏదో యాధృచ్ఛికంగా జరగలేదు. నువ్వు యేసుప్రభువును మరచిపోయినా ఆయన నిన్ను ఇంకా ప్రేమిస్తునే ఉన్నాడు. ఈ రోజు మనమిద్దరం కలుసుకోవటం దేవుని ఏర్పాటు ఇంతకు ముందు యేసుని ఎరిగిన వాడివి కనుక ఆయన సహవాసంలో ఉండు అన్నాను.

--------

8-12-07న చేబ్రోలు సాల్మన్‌రాజు గారి ఆహ్వానం మేరకు గుంటూరుజిల్లా కూచినపూడి ప్రక్కన ఉన్న ప్రజ్ఞం గ్రామంలో స్తుతికూటమునకు వెళ్ళుటకు ఒంగోలు-విజయవాడ ప్యాసింజరులో బయలుదేరి బాపట్ల ప్రక్కన ఉన్న అప్పికట్ల గ్రామానికి వచ్చాను. అక్కడ రామారావు బొమ్మ ఎదురుగా ఉన్న గరికపాటి కృష్ణమూర్తి వారి భార్య మల్లీశ్వరి అన్యులైయుండి ప్రభునామమున విశ్వసించి బాప్తిస్మం తీసికొన్నారు. వారిని దర్శించి బస్‌లో పొన్నూరు వెళ్ళాను. అక్కడ ఓ సహోదరుని అడ్రసు కొరకు పాత పొన్నూరులోని ఏదైన చర్చికి తీసుకొని వెళ్ళమని రిక్షా ఎక్కాను. ఇందిరాకాలనిలోని ది లివింగ్ వర్డ్ చర్చి పాస్టరుగారైన తాళ్ళూరి డానియేల్ గారింటికి తీసుకొని వెళ్ళాడు. పాస్టరు గారిని కె.రోశయ్య అడ్రసు అడిగితే ఆయన చాలా అవసరమయిన పని మీద ఉన్నప్పటికి రోశయ్య గారింటికి తీసికొని వెళ్ళారు.ఆ సమయంలో ఆ ఇంటి వారికి ప్రార్థన అవసరత చాలా ఎక్కువగా ఉంది. అక్కడ ప్రార్థించిన తర్వాత రెండురోజుల క్రితం 100 రూపాయలు హన్నాకృప కొరకు పంపించిన డి.వి.శర్మ రిటైర్డ్ డిప్యూటి ఛీఫ్ కంట్రోలర్ గారిల్లు నార్తు కేబిన్ పేటకు బండిమీద తీసికొని వెళ్ళారు. మా ప్రయాణం మొత్తంలో డానియేల్ పాస్టరుగారి విశ్వాసపూరిత సాక్ష్యము విన్నాను.

తర్వాత పొన్నూరు సెంటర్‌లో నన్ను వదలి వెళ్ళారు. నేను ప్రజ్ఞం గ్రామము వెళ్ళే బస్ కోసం విచారిస్తుంటే రెండు పెద్దమూటల మీద కూర్చున్న 50 సం॥ల వ్యక్తి నన్ను పిలచి తన పక్కన కూర్చోమన్నాడు. నేను ప్రజ్ఞం వెళ్తున్నాను అన్నాడు.

నేను కూర్చున్న తర్వాత, 30 సంవత్సరాలకు పూర్వం ఓ వ్యక్తి నాకు చాలా లావైన పుస్తకం ఇచ్చి చదవమన్నారు. దానిని 20సం॥లు దాచి చదవకుండా వేరే వాళ్ళకు ఇచ్చాను. అది ఏమి పుస్తకము? మీరు పాస్టరు గారా? అని అడిగాడు.

అయ్యా, దానిని బైబిల్ అని అంటారు. దేవుడు ఆది యందు భూమి ఆకాశములను ఎలా చేసాడు తర్వాత ఈ భూమి ఆకాశము ఎలా పోతాయి? మరణించిన తర్వాత ఏమి జరుగు తుంది? అంతా వ్రాయబడివుంది. మీరు ఆ పుస్తకం వదిలించు కొనిన యేసుప్రభువు మిమ్ములను వదలలేదు అని హన్నాకృప మరి రెండు పుస్తకాలు ఒక క్రొత్తనిబంధన ఇచ్చాను.

ప్రజ్ఞంలో ప్రార్ధన అయిన తర్వాత బస్ కోసం ఎంత సేపు ఎదురుచూచినా బస్ రాలేదు. అంతలో ఓ మోటారుసైకిల్ మీద బండి పురుషోత్తంగారు కూచినపూడి వెళ్తూ నన్ను ఎక్కించు కొన్నారు. కూచినపూడిలో చీరాల బస్ ఎక్కి ఒంగోలుకు రైలులో వచ్చాను.

**ఈ నెల పోషకులు :**

| | | |
|---|---|---|
| కుమారి జి. హేమలత, | బెంగుళూరు | 2000 |
| రెవ.డా॥కె.జోసఫ్, ఐ.ఇ.ఆర్.యఫ్, | ఒంగోలు | 2000 |
| మహేష్‌ఖన్నా టేల్కర్, | అనంతపురం | 1000 |
| డా॥ హుస్సేనయ్య | బేస్తవారిపేట | 1000 |
| రెవ. డా॥ యం. శాంతవర్ధన్, | గుంటూరు | 1000 |
| శ్రీ యడవల్లి ప్రసాదరావు, | హైదరాబాద్ | 1000 |
| శ్రీ సాల్మన్‌రాజు, ఆర్.యం.ఆర్టీసి | కడప | 1000 |
| రెవ. డా॥ ఎబినెజర్ | హైదరాబాద్ | 1000 |
| శ్రీమతి అమ్మాజి | ఒంగోలు | 500 |
| డానియల్ పిళ్ళై, | హైదరాబాద్ | 500 |
| సునీలాశేఖర్ | హైదరాబాద్ | 500 |
| ప్రకాష్ | కర్నూలు | 500 |
| శ్రీమతి కూచిపూడి సౌభాగ్యం, | ఒంగోలు | 200 |
| శ్రీ చీమకుర్తి జాన్‌వెంకటేశ్వర్లు | ఒంగోలు | 200 |
| శ్రీ జంగాల ఆనందం | ఒంగోలు | 200 |
| శ్రీమతి కె. ఫ్లోరా | చెన్నై | 200 |
| శ్రీ సి.హెచ్. సాల్మన్‌రాజు | నర్సరావుపేట | 200 |
| ముక్కు బాలక్రిష్ణారెడ్డి | కనిగిరి | 200 |
| అరుణా ఇమ్మానియేల్ | ఒంగోలు | 200 |
| పరాక్రమ్ జోసఫ్ | ఒంగోలు | 200 |
| శ్రీ కె. బి. డేవిడ్ లివింగ్‌స్టన్, | మార్కాపురం | 100 |
| డి.ఎ.శర్మా | పొన్నూరు | 100 |
| వీరాస్వామి | ఒంగోలు | 100 |
| నాగరాణి | ఒంగోలు | 100 |
| వేదమణి | పులివెందులు | 100 |

**పాఠకులకు గమనిక**

ఈ సంవత్సరము (2008) నుండి పత్రిక సంవత్సర చందా **150/-** రూపాయలు. చందా పంపదలచిన వారు మా యొక్క బ్యాంక్ (S.B.I.) ఆన్‌లైన్ అకౌంట్ నెం.**10957294362** ద్వారా పంపవచ్చును. కనుక పాఠకులు గమనించ ప్రార్ధన.

21వ పేజి తరువాయి....

నా జీవితంలో నామీద జరగబోయే సాతాను (చీకటి శక్తుల) దాడిని దేవుడు నాకు ముందుగా చూపించాడు. ఆ దిశగా దేవుడు నన్ను సిద్ధపరచుచున్నాడనే గ్రహింపును పరిశుద్ధాత్మ దేవుడు నాకు బయలుపరిచాడు.

**<u>ఆత్మీయ సత్యములు:</u>**

**కొండ :** క్రైస్తవ లోకము.

**నున్ననిబండ :** రక్షకుడైన యేసుక్రీస్తు.

**పందుకొనుట :** ఆత్మీయ జీవితంలో మందగించుట లేక వెనుకబడుట.

**కాళ్ల పట్టుకొను ప్రయత్నము :** శత్రువైన సాతాను దాడిచేయుట.

**కాళ్ల విదిలించుట :** పరిశుద్ధాత్మ దేవుని సహాయంతో సాతానుని ఎదుర్కొనుట.

**నోటితో అరచుట :** దేవుని వాక్యాన్ని హృదయంలో ఉంచుకొని నోటితో పలుకుట.

**మరలా మరలా దాడిచేయుట :** సాతాను పట్టువిడువకుండా మరలా మరలా దాడిచేయుట. మరలా మరలా దేవుని సహాయంతో దాడిని ఎదిరించుట.

**విడిచిపెట్టి వెళ్ళుట :** సాతానుడు అన్నివిధాల మన మీద దాడిచేసి అన్ని ఆయుధాలను మనమీద ప్రయోగిస్తాడు. పరిశుద్ధాత్మ దేవుడు మనకు అండగా నిలిచినప్పుడు వాటన్నిటిలో నుండి మనలను తప్పించి చివరిగా మనకు విజయం చేకూర్చుతాడు. అంతిమ విజయం మనదే.

దేవుడు నన్ను ఏ విధంగా సిద్దపరచాడు? నేను దుష్టుణ్ని ఏ విధంగా ఎదిరించినాను? వాడు ఎట్లా పారిపోయాడు. పరిశు ద్ధాత్మ దీవెనలను ఏ విధంగా పొందాను? నా కల యొక్క ఆత్మీయ సత్యాలు ఏమిటి? నీవు కూడ చదివి గ్రహించగలిగితే నీకు దీవెన.

కనుక క్రైస్తవ విశ్వాసి ఎట్టి పరిస్దితిలోను నీకు జయమునిచ్చి ధైర్యపరచడానికి క్రీస్తు భూమి మీద నరావ తారుడిగా జన్మించాడు. సాతాను శక్తుల మీద జయము నను్గ్రహించినాడు. ఇది నా అనుభవము. దీనిని నీకు కూడ అనుగ్రహించగలడు. ఎంతమందికి అనుగ్రహించినా తరుగని మహాప్రభావము కలిగిన వాడు మనదేవుడు.

ఇట్లు
క్రీస్తునందు మీ సోదరుడు
**ఎస్.ఏ.టి.ఆర్. ప్రసాద్**

# సువార్తలలోని యేసు కథ

74

పండుగలో ప్రజల మధ్యన గొప్ప సణుగు లేచింది.ఒక దశలో అది ఒక అలజడిలా కనిపించింది.ఇంతకుముందు యేసు ఏదైన ఆశ్చర్యక్రియ చేస్తే కలిగే అలజడికాక ఇది ఆయన వ్యక్తిత్వము మిదనే నడిచింది. సమయము కొరకు నిఘావేసిన యూదులు, పరిసయ్యులు హడావిడిగా తాత్కాలిక అత్యవసర సమావేశమునకు సభ్యులను పిలచారు. సాధారణముగా సన్‌హెడ్రిన్ సభలో 70మంది సభ్యులు ప్రధానయాజకుడు అధ్యక్షునిగా 71మంది ఉండాలి. అయితే అత్యవసర సమావే శమునకు 23మంది సభ్యులు హాజరయితే చాలు.

ఈవిధముగా ఏర్పాటయిన సమావేశములో 23 సభ్యులలో నికోదేము ఒకనిగా కూర్చున్నాడు. నికోదేము యేసుని కలసికొనిన సంగతి ఎవరికి తెలియదు. యేసుని ఏదోఒక కారణాన బంధించితే ప్రభుత్వం దృష్టిలో ఒక నేరస్తునిగా కాని తిరుగుబాటుదారునిగా కాని ముద్రవేయవచ్చును. గత రెండు సంవత్సరములుగా ఎదురుచూచిన సమయము ఈపండుగలో కలసివచ్చిందని యేసు శత్రువులు సంతోషించారు. అయితే "అతను మాట్లాడినట్లు ఇంతవరకు ఎవరూ మాట్లాడలేదు" అనిన బంట్రోతుల మాట సభికులను నీరుగార్చింది. నికోదేము వంటివారు హృదయములో సంతోషించారు.

దేవాలయ సైనికులు అంటే బంట్రోతులు రోమా సైనికుల కంటే క్రూరులు అటువంటి వారు సహితము అతి సున్నితముగా ఆ మనుష్యుడు మాట్లాడినట్లు ఎవడును ఎన్నడును మాట్లాడలేదు అనగానే మొట్టమొదటి సారిగా దేవాలయ సైనికుల పరాజయం దేవాలయములోనే నిరూపణ అయింది. బంట్రోతులను పంపిన ప్రధానయాజకులు రెండవ వరసకి చెందిన వారయినందున ప్రధానయాజకుడైన కయప కాని అతని మామ అయిన 'అన్నా' కాని సభలో లేనందున తర్వాత ప్రధానయాజకుడైన కయపతో మాట్లాడవచ్చును అనుకొని బంట్రోతుల వైపు తిరిగి మిమ్ములను కూడ అతను మోసం చేసాడా? మహాసభ సభ్యులలోగాని పరిసయ్యులలోగాని ఎవరైనా ఆయన యందు విశ్వాస ముంచారా? అన్నారు. మరి యెక యాజకుడు నికొదేము వైపు చూస్తూ. ధర్మశాస్త్రమెరుగని ఈ జనసమూహము శాపగ్రస్తమై నది అన్నాడు. అదే అదను కొరకు చూస్తున్న నికొదేము.

ఒక మనుష్యుని మాట వినక మునుపు అంటే ధర్మశాస్త్రాను సారంగ విచారణ జరిపించకుండా శిక్ష విధిస్తుందా అని అడిగాడు. సన్‌హెడ్రిన్ సభలో ఉన్నవారిలో అన్ని విషయాలలో పట్టించుకోకుండా కూర్చునేవాడు. డబ్బులో పలుకుబడికలిగిన వాడైన నికోదేము మాట్లాడేటప్పటికి అందరూ ఆశ్చర్యపోయారు. కాని ప్రధానయాజకులలో ఒకరు

మీరు గలిలయ నుండి వచ్చారా? ఏమిటి? ధర్మశాస్త్రాన్ని పరిక్షించు గలిలయ నుండి ఏ ప్రవక్త రాలేదని తెలుస్తుంది అన్నాడు. నికొదేముకు తెలుసు వారికి ఎలా జవాబు చెప్పాలో ధర్మశాస్త్రమును పరిక్షించనిది వారే గలలియనుండి ఎందరో ప్రవక్తలు, అమిత్తయి కుమారుడైన యోనా గాత్‌వింపరు నుండి నహూము ఎల్కొషు నుండి హోషియా గలలీయులే తర్వాత ఏలీయా, ఎలీషా, ఆమోసు కూడ పాలస్తీనాలోని ఉత్తర ప్రాంతము వారే. ఉత్తర ప్రాంతము వారంటే దక్షిణాది వారికి నిరాదరణ, హీనత.

సభ ముగించి ఎవరింటికి వారు వెళ్ళారు.యేసుప్రభువు మాత్రమే కిద్రోను వాగుదాటి ఒలీవచెట్లుండే కొండఎక్కి నక్షత్రముల సాక్షిగా రాత్రి గడిపాడు.

ఇంకా చీకటి ఉండగానే యోరూషలేము గావిని తలుపులు తెరవగానే ఆయన పట్టణంలో ప్రవేశించి దేవాలయము ప్రాంగణంలో ఓ మండపము వద్ద కూర్చున్నాడు. ఇంక కొంచెం సేపట్లో ఏమి జరగబోతున్నదో ఆయనకు తెలుసు.కనుక ఉదయాన్నే దేవాలయము లోనికి వచ్చాడు.ఆయన చుట్టూ జనసమూహము పోగైనారు. వారికి ఆయన దేవుని గురించి బోధించనారంభించాడు. పండుగలో ఆఖరిరోజు అయినందున జనం పలుచబడ్డారు.

ఇంతలో ఏదో కోలాహలం వినవచ్చింది.వాక్యం వింటున్న వారంతా అటు చూసారు.ప్రభువు వారికి బోధించడం ఆపాడు. పరిసయ్యులు శాస్త్రులు గుంపుగా ఆ మధ్యలో ఓ యౌవనస్తురాలు తల బాగా రేగి ఉన్నది. ఇద్దరు బంట్రోతులు ఆమెను పట్టుకొని వస్తున్నారు.

వారు యేసు దగ్గరకు వచ్చిన తర్వాత ఆమెను యేసువద్దకు బలంగా నెట్టారు. ఆమె యేసు వద్ద పడబోతే మరలా వారే ఆమెను లేపి నిలువబెట్టారు. యేసు కూర్చుండియున్నాడు. ఆయన

...మిగతా 25వ పేజీలో

# అరచు పిల్లకాకులు

నా పేరు కల్వరి సుధాకర్. నిజంగా దేవునిలో విశ్వాసంతో జీవించుట మాధుర్యం. ఆ దినాల్లో నేను, నాభార్య, నా నలుగురు పిల్లలం ఒంగోలు మామిడిపాలెం వచ్చాము. నేను తాడిపర్తి ప్రభాకరరావుగారి కుమారుడనని ఎక్కడో ఉద్యోగం చేస్తున్నా నని మాత్రమే జనానికి తెలుసు. కానీ నేను సంపూర్ణ సేవకై ఉద్యోగం విడిచిపెట్టి వచ్చి కేవలం విశ్వాసం ద్వారా జీవిస్తున్నామని ఎవరికి తెలుసు? దేవునికి మాకు తప్ప.

ఇంట్లో నుండి బజారుకు వస్తున్నాను. నా చేతిలో నయాపైసా లేదు. బజారంతా తిరిగి పలకరించాల్సిన వారిని పలకరించి, చూడాల్సినవి చూసి, మధ్యాహ్నానికి యింటికి వెళ్తున్నాను. యింట్లో భార్య, నలుగురు చిన్నపిల్లలు వున్నారు. యింత బజారులో యింత పట్టణంలో నుండి దైవసేవకుడి పిల్లలకు ఏమీలేవా? ఒక తండ్రియైన వాడు పిల్లలకు చేయగలిగిందింతేనా అనే తలంపులు వేధిస్తున్నాయి. పిల్లలు ఎదురు వస్తారు, నేనేమీ తేలేదని చెప్పనా? కొణిజేడు బస్టాండు దాకా వచ్చాను. అక్కడ కొణిజేడు పోవడానికి బస్ రెడీగా ఉంది. బస్‌డ్రైవర్ బస్‌ను ముందుకు పోనివ్వడు అలా అని ఇంజను ఆపడు. జనం బస్ నిండా బస్‌పైన కిక్కిరిసి ఉన్నారు. బస్ నిచ్చెనమీద జనం కొందరు ఎక్కండి ఎక్కండి అని తొందర చేస్తున్నారు. దాని ప్రక్కనే నేను ఈ చోద్యం అంతా చూస్తూ నడుస్తున్నాను. ఎట్టకేలకు పైవాడు కొంచెం సర్దుకొనగా క్రిందివాడు ఎక్కచూస్తున్నాడు. వాడి చేతులు పట్ట గలిగినంతగా ఆచేతిలో మూడు ఈచేతిలో మూడు జామ కాయలున్నవి. బస్‌నిచ్చెన పట్టుకోవాలంటే జామకాయలున్నవి చేతిలో, పట్టుకోకుంటే మళ్ళీ రేపే బస్ వుంటుంది ఎలా చేయటం? ప్రక్కనే నడుస్తున్న నా వైపు చూసాడు. నేను సహాయ పడడానికి సిద్ధంగా ఉన్నాను. నా రెండు చేతులకు ఆరు జామకాయలు పట్టించాడు. బస్ నిచ్చెన పట్టుకున్నాడు కానీ, పైవాడు పైకివెళ్ళడు క్రిందివాడు నిచ్చెన వ్రేలాడుతున్నాడు. బస్ నెమ్మదినెమ్మదిగా స్పీడు అందుకుంది. జామకాయల వైపే చూస్తున్నాడు. పట్టుకోలేడు మా ఇద్దరి మధ్య దూరం ఎక్కువైంది. నాకిద్దాం అనిపించినా అతను తీసుకోలేడు చూస్తుండగా బస్ వెళ్ళిపోయింది. జామకాయలు ఆరు నా చేతులనిండుగా దేవుడే నాకు యిలా ఇచ్చాడని సంపూర్ణంగా విశ్వసించాను. ఎందుకంటే యిదిఒక్కటే కాదుకదా దినమొక అద్భుతం జరిగితేనే మా జీవితం గడిచేది. నేను ముందే చెప్పాను మేము ఆరుగురమని జామపండ్లు సరిగ్గా ఆరే, దేవునికి లెక్క తెలుసు, అవసరం తెలుసు. మన దేవుడు ఉన్నవాడు. ఆయన అరచు పిల్లకాకులకు ఆహారమునిచ్చును.

మరి పక్షులను పోషించిన దేవుడు మరెంతో శ్రేష్టులమైన మనలను పోషించడా? విశ్వాసి భయపడకుము దిగులు పడకుము, నీ కన్నా నీ అవసరతలు దేవునికి బాగా తెలుసును. నీవు గొప్ప భక్తుడవు విశ్వాసివి కాకున్నా ఆయన నీ ప్రతి అవసరతను తీర్చును. “తన సొంత కుమారుని అనుగ్రహించు టకు వెనుక తీయక మనందరి కొరకు ఆయన అప్పగించిన వాడు ఆయనతో పాటు మనకు సమస్తమును మనకెందు కనుగ్రహించడు?” రోమా 8:23.

---

24వ పేజీ తరువాయి....

చుట్టూ ఉన్న ప్రజలు అందరూ లేచి నిలుచున్నారు. ఆయన గోడకానుకొని కూర్చుని ఆమెవైపు నిదానంగా చూచి తలెత్తి ఆమెను తన దగ్గరకు తీసికొని వచ్చిన వారిలో ముఖ్యుడనిపించిన శాస్త్రిని ఏమిటి? అన్నట్లు చూసాడు.

బోధకుడా ఈ స్త్రీ వ్యభిచారము చేస్తుండగా పట్టుబడింది. మోషే ధర్మశాస్త్రంలో ఇలాంటి స్త్రీని రాళ్ళతో కొట్టి చంపమని ఆజ్ఞాపించాడు. మరి మీరేమంటారు అన్నాడు.

ధర్మశాస్త్రానుసారంగా ఆమెను రాళ్ళతో చంపమంటే, అందులోను నేను ధర్మశాస్త్రాన్ని నెరవేర్చుటకు వచ్చాను అని చెప్పియున్నాడు కనుక రోమా చట్టాన్ని తన చేతిలోనికి తీసి కొన్నట్లు అవుతుంది అంతేగాక ఈయన దయాదాక్షిణ్యాలు లేనివాడు అని ప్రజలకు చెప్పవచ్చును, లేదు ఆమెను క్షమించి వదిలివేయమంటే ఈయన ధర్మశాస్త్రానికి విరోధి అని ప్రచారం చేయవచ్చును అని వారి యోచన.

ఆయన కూర్చున్న అరుగు మీదనుండి మట్టినేల మీదకు జరిగి వంగి కూర్చున్నాడు. ఆయన లేచి వెళ్ళిపోతాడేమో ఏమి జవాబు చెప్పడేమో అని చూస్తూ మరలా ఆయనను అదే ప్రశ్న అడగడం ప్రారంభించారు. (సశేషం)

ప్రభువగు యెహోవా నా బలము



# ఆహ్వానము

**రెవ. కృపాదానం, హన్నమ్మగార్లచే**

నిర్వహించబడిన **"ఒంగోలు చిల్డ్రన్ హోం"** నందు

1965 వ సంవత్సరము నుండి 1975వ సంవత్సరము వరకు నివశించి చదువుకొనిన

వారందరిని ది అన్‌డినామినేషనల్ చర్చ్ ఆఫ్ ది లార్డ్ ఇన్ ఇండియా

## 50 సం॥ల గోల్డెన్ జూబ్లి

వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కూటములకు

అందరూ కుటుంబములతో రావలసినదిగా ఆహ్వానించుచున్నాము.

**తేదీలు : 2008 జనవరి 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు**

**స్థలము : ప్రభువు సంఘము, కృపాదానం వీధి, క్లౌపేట, 6వలైను, ఒంగోలు**

**ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయబడినది**

<u>గమనిక :</u> ఈ కూటములకు హాజరు కాదలచినవారు జనవరి 15వ తేదీ లోపల ఫోన్ ద్వారా మాకు తెలియజేయ వలసినదిగా కోరుచున్నాము.

□ **చిల్డ్రన్ హోంనందు చదివిన పూర్వ విద్యార్థుల అడ్రసులు మీకు తెలిసివుంటే దయచేసి మాకు తెలియచేయండి**

ఇట్లు

మీ **సామన్న**

(సామ్యేల్ రాజేంద్ర)

ప్రెసిడెంట్, యు.సి.యల్.ఐ.

సెల్ : **9908822365, 9866716506**



**ORTH AST EST OUTH**

# సెమి క్రిస్మస్ వేడుకలకు మత మార్పిడి రంగు

హైదరాబాద్,డిసెంబర్11: బంజారాహిల్స్, నందినగర్ దగ్గర ఉన్న ఎ.పి స్టడీసర్కిల్ లోని క్రైస్తవ విధ్యార్థులు జరుపుకోదలచిన సెమిక్రిస్మస్ వేడుకలను మతమార్పిడి, అన్య మత ప్రచారం అంటూ ఎ.బి.వి.పి,ఆరెస్సెస్ నాయకులు సంయుక్తంగా వీరంగం సృష్టించారు.

వివరాల ప్రకారం స్టడీసర్కిల్‌లో చదువుకుంటున్న సుమారు 20మంది క్రైస్తవ విధ్యార్థులు క్రీస్తు ప్రేమను తమతోటి విధ్యార్థులతో పంచుకోవాలని స్టడీసర్కిల్‌లోని క్రైస్తవేతర విధ్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసుకున్నారు. డిసెంబర్ 11 మంగళవారం సాయంత్రం 7గంటలకు వేడుకలు నిర్వహించ తలపెట్టి స్థానిక నందినగర్ బాప్టిస్ట్‌చర్చి పాస్టర్‌గారైన రెవ.టి.పి.మాథ్యూస్‌గారిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించారు. కార్యక్రమం ప్రారంభమైన కొద్దిసేపటికి స్టడీ సెంటర్‌కు ఏమాత్రం సంబంధంలేని ఎ.బి.వి.పి., ఆరెస్సెస్ నాయకులు పరమత సహనం లేకుండా క్రిస్మస్ వేడుకలను మతమార్పిడి కార్యక్రమం అంటూ ఆందోళనకు దిగి వీరంగం సృష్టించారు. విషయం తెలిసిన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పోలీసులు ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుల్స్ వచ్చి ప్రాధమిక విచారణ చేశారు. ప్రత్యేక అతిధిని అరెస్ట్ చేయాలని ఆందోళనకారులు గూండాలవలె ప్రవర్తించారు. ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో ఎయస్పీ, సి.ఐ. మరికొందరు పోలీసు సిబ్బంది మీడియా వారితో సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితి సమీక్షించారు. ఎక్కడ చూచినా ఎ.బి.వి.పి. పలురకాల సంస్థలపై, వ్యక్తులపై దాడులు చేయటం ఆందోళన కలిగిస్తుంది. 26వ తేదీన ఓ.యు. క్యాంపస్‌లో జరిగిన గొడవలో ఎ.బి.వి.పి ఉండటం దీనికి తార్కాణం. మతమార్పిడి కార్యక్రమం జరగటం లేదని అందులో కేవలం క్రిస్మస్ వేడుకలు మాత్రమే జరుగుతున్నాయని పోలీసు అధికారులు తెలియజేశారు.

మతమార్పిడి అంటూ ప్రచారం చేసిన మీడియా, గత కొంతకాలంగా క్రైస్తవులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సాధనాలలోని ఒక వర్గం దీనిని ఆరెస్సెస్, ఎ.బి.వి.పి నాయకులకు అనుగుణంగా వారి వక్రబుద్ధిని సుబుద్ధిగా చూపే ప్రయత్నంలో భాగంగా ఎప్పటివలె క్రైస్తవులకు వ్యతిరేకంగా క్రిస్మస్ వేడుకలను మతమార్పిడి కార్యక్రమం అంటూ ప్రచారం చేయటమే దీనికి నిదర్శనం. క్రైస్తవ విద్యార్థుల నుండి స్వీకరించిన సమాచారం ప్రసారం చేయక ఆందోళకారుల పక్షంగా ప్రసారం చేయటం దీనికి నిలువుటద్దం.

# క్రైస్తవులపై దాడి - చర్చిలు ధ్వంసం - ఒకరి మృతి

ఒరిస్సా, డిసెంబర్ 25 : ఒరిస్సా రాష్ట్రంలోని కాంధమత్ జిల్లా పరిధిలోని పలు గ్రామాలలో క్రిస్మస్ రోజున పలుదాడులు జరిగాయి. చర్చిలు ధ్వంసం చేయబడి కాల్చబడ్డాయి. ఈ గొడవలలో ఒక వ్యక్తి మృతిచెందాడు.

వివరాల్లోకి వెళితే డిసెంబర్ 21 సోమవారం బ్రహ్మంగిగావ్ గ్రామ మార్కెట్ ప్రాంతంలో క్రైస్తవులు క్రిస్మస్ పర్వదినాన్ని సంతరించుకొని ఏర్పాటు చేయదలచిన కటౌట్ల విషయమై స్థానిక హిందువులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతటితో ఆగని దుండగులు లక్ష్మానంద్ సరస్వతి అనే వి.హెచ్.పి. నాయకుని ఆధ్వర్యంలో మతమార్పిడి చేస్తున్నారంటూ మతమార్పిడి వ్యతిరేక ర్యాలి నిర్వహించారు. దీంతో కలతచెందిన కొందరు వి.హెచ్.పి. నాయకునిపై దాడి చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన కొందరు వి.హెచ్.పి. తీవ్రవాదులు సోమవారం రాత్రి బాలిగూడ ప్రాంతంలో మూడు చర్చిలను ధ్వంసంచేసి తగులబెట్టారు. క్రిస్మస్ రోజున చాకపడ, గిరిన్‌గియ, పిరిన్‌గియ ప్రాంతాలలో కూడ చర్చిలను తగులబెట్టారు. ఈ గొడవలలో బార్కంబ గ్రాంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. వి.హెచ్.పి. తీవ్ర వాదులు జిల్లాలోని పలు క్రైస్తవ అనాధశరణాలయాలపై దాడులు చేశారు. అంతటితో ఆగక పోలీసు వారిపై కూడ దాడి చేసి పుల్‌బాని సి.ఐ. జీపుని తగులబెట్టారు. శాంతి, ప్రేమలకు మారుపేరైన క్రిస్మస్ పర్వదినాన వి.హెచ్.పి. తీవ్రవాదులు క్రైస్తవులపై దాడులు చేయటం శోచనీయం. పలుప్రాంతాలలో పోలీసు పహారా ఏర్పాటు చేసి కర్ఫ్యూ విధించారు. బిజేపి దీనిని రాజకీయ లబ్ధికోసం జాతుల మధ్య తగాదాగా వల్లిస్తుంది. యావత్ క్రైస్తవలోకం దీనివిషయమై తీవ్ర విభ్రాంతి చెందింది.